PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 58, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శనివారం - 18 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

### పాంపీలో పురాతన 'మెషిన్ గన్'.. వెలుగులోకి 2000 ఏళ్ల నాటి యుద్ధ రహస్యం!



పాంపీ గోడలపై, పురాతన 'మెషిన్ గన్' లాంటి ఆయుధం వాడిన గుర్తులు

క్రీ.పూ. 89లో రోమన్ జనరల్ సూలా ఈ దాడి చేసినట్లు పరిశోధకుల నిర్ధారణ

2లో

### క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్



అరేబియా సముద్రంలో క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు వెల్లడి

ఈ నెల 20 నుంచి 21 వరకు పాకిస్థాన్ నోటమ్ జారీ

ఈ నెల 22 నుంచి 25 వరకు భారత్ నోటమ్ జారీ

2లో

### చిన్న గెలాక్సీలలోనూ బ్లాక్ హోల్స్.. భారత శాస్త్రవేత్తల పరిశోధనలో కొత్త కోణం



పాలపుంత చుట్టూ ఉన్న చిన్న గెలాక్సీలలో బ్లాక్ హోల్స్ ఉండొచ్చని భారత శాస్త్రవేత్తల అధ్యయనం వెల్లడి

ఈ పరిశోధన చేపట్టిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ శాస్త్రవేత్తలు

2లో



### మహిళా బిల్లుతో నవశకం.. ఏపీలో మాత్రం 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది

- మహిళా శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చు
- మహిళల అభివృద్ధి కోసం సామాజికి సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని కితాబు
- కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయి

2లో

అమరావతి: దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చిన ఈరోజు దేశ చరిత్రలో ఒక గొప్ప రోజని వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని కొనియాడారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో

# మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ బిల్లుకు బ్రేక్...

- లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు
- రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు
- బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు




ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో అనూహ్యమైన ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో వీగిపోయింది. బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓడిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ కీలక బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో హాజరైన వారిలో మూడింట రెండొంతుల మంది, అంటే 352 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే, ప్రభుత్వం ఈ మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోవడంలో విఫలమైంది. రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన వెంటనే, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన చేశారు. ఈ బిల్లుతో అనుబంధంగా ఉన్న 'డీలిమిటేషన్ బిల్లు, 2026', 'కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026'లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటున్నట్లు సభకు తెలిపారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను శనివారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు.



### యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

- 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి
- యూకేతో పాటు యూరప్ దేశాల్లో పర్యటించనున్న జగన్
- కుటుంబంతో కలిసి 25 రోజుల పాటు విదేశీ పర్యటన
- పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు సీబీఐకి ఇవ్వాలని కోర్టు ఆదేశం

అమరావతి: వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. మిగతా..2లో



2లో

### ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రభుత్వం నట్టేట ముంచింది: కవిత

- ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలుచేస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వానికి కవిత ప్రశ్న
- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని గాలికి వదిలేశారని విమర్శ
- రిటైర్మెంట్ బకాయిల కోసం వృద్ధాప్యంలో ఉద్యోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన

హైదరాబాద్: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడిని కల్వకుంట్ల కవిత

### 20 ఏళ్లలో నేను చేయలేనిది.. ప్రియాంక 5 నిమిషాల్లో చేసింది

రాహుల్ వ్యాఖ్యలతో లోక్‌సభలో నవ్వులే నవ్వులు

- హోంమంత్రి అమిత్ షాను తన ప్రసంగంతో ప్రియాంక నవ్వించారని ప్రశంస
- తనకు, ప్రధానికి కుటుంబ సమస్యలు లేవంటూ చమత్కారం
- రాజకీయాల్లో తన సోదరి నుంచి ఎంతో నేర్చుకోవాలని వ్యాఖ్య



ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రాపై ప్రశంసల వర్షం కురిపించారు. తాను 20 ఏళ్లలో సాధించలేనిది, ప్రియాంక కేవలం ఐదు నిమిషాల్లో మిగతా..2లో

### నాసిక్ టీసీఎస్‌లో బలవంతపు మతమార్పిడి..

తీవ్రంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం

టీసీఎస్ లైంగిక వేధింపులు, మత మార్పిడి ఆరోపణలపై తొలిసారి సీఎం స్పందన

దీని వెనుక పెద్ద ముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా వెల్లడైందన్న సీఎం

సంస్థలో జరిగిన ఘటనను గుర్తించిందంటూ టీసీఎస్‌పై ప్రశంస

టీసీఎస్ యాజమాన్యం పోలీసుల దర్యాప్తుకు సహకరిస్తోందని వెల్లడి

మహారాష్ట్ర: నాసిక్‌లోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) యూనిట్‌లో



జరిగిన లైంగిక వేధింపులు, బలవంతపు మత మార్పిడి ఆరోపణలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తొలిసారిగా స్పందించారు. ఈ ఘటన 'కార్పొరేట్ జిహాద్' చర్య అని తేలితే, దాని మూలాలను గుర్తించేందుకు మిగతా..2లో



2లో

### సభికులను నవ్విస్తూనే ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రియాంకా గాంధీ

- లోక్ సభలో ఆకట్టుకున్న వయనాడ్ ఎంపీ తొలి ప్రసంగం
- 21 నిమిషాల పాటు సాగిన ప్రసంగంలో సుతిమెత్తగా ప్రభుత్వాన్ని చురకలు
- నెహ్రూ పేరుతో చమత్కారం.. డీలిమిటేషన్ పై ఘాటు హెచ్చరిక



### తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలంటూ పొన్నం లేఖ.. డీజీపీ స్పందన ఏమిటంటే..!

- తెలంగాణలో దుమారం రేపుతున్న తేజస్వి సూర్య వ్యాఖ్యలు
- క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి పొన్నం లేఖ
- చట్టసభల్లో సభ్యులు మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు లేదన్న డీజీపీ

హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యల దుమారం ఇప్పుడు న్యాయపరమైన మలుపు తిరిగింది. మిగతా..2లో



2లో

### డీలిమిటేషన్‌తో అన్యాయం జరిగితే ఊరుకోం: లోక్‌సభలో మిథున్ రెడ్డి

- ప్రత్యేక హోదా అంశాన్ని లోక్ సభలో గుర్తు చేసిన మిథున్ రెడ్డి
- హోదా ఇస్తామని చెప్పి.. ఆ తర్వాత చట్టంలో లేదని తప్పించుకున్నారని విమర్శ
- డీలిమిటేషన్ విషయంలో అదే పునరావృతమైతే సహించేది లేదని హెచ్చరిక

## దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉంది

ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

- వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలి
- కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
- 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలి
- యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుంది
- రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ



హైదరాబాద్: యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమని మిగతా..2లో

## పాంపీలో పురాతన 'మెషిన్ గన్'..
## వెలుగులోకి 2000 ఏళ్ల నాటి యుద్ధ రహస్యం!

ఢిల్లీ: పాంపీ నగరం అనగానే క్రీ.శ. 79లో వెసువియస్ అగ్నిపర్వతం బద్దలై బూడిద కింద సమాధి కావడం గుర్తుకొస్తుంది. కానీ, ఆ వినాశనానికి సుమారు 170 సంవత్సరాల ముందే అక్కడ జరిగిన ఓ భీకర యుద్ధానికి సంబంధించిన కీలక ఆధారాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. పురాతన కాలం నాటి 'మెషిన్ గన్'గా పిలిచే 'పాలిబోలోస్' అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అక్కడ వాడినట్లు పరిశోధకులు గుర్తించారు. ఇటలీకి చెందిన కాంపానియా, బోలోగ్నా యూనివర్సిటీల పరిశోధకులు అధునాతన లేజర్ స్కానింగ్ , 3డి డిజిటల్ ఇమేజింగ్ టెక్నాలజీ సహాయంతో ఈ ఆవిష్కరణ చేశారు. పాంపీ ఉత్తర ప్రాంతంలోని కోట గోడలపై బాణాల దాడికి సంబంధించిన ప్రత్యేకమైన గుర్తులను గుర్తించారు. సాధారణ కాటపల్ట్ దాడుల్లా కాకుండా, ఈ గుర్తులు చిన్నవిగా, గుంపులుగా ఉన్నాయి. ఒకే చోటు నుంచి వేగంగా బాణాలను ప్రయోగించడం వల్లే ఇలాంటి గుర్తులు ఏర్పడతాయని పరిశోధకులు విశ్లేషిస్తున్నారు. ఈ దాడి క్రీ.పూ. 89లో రోమన్ జనరల్ లూసియస్ కార్నెలియస్ సూలా పాంపీని ముట్టడించినప్పుడు జరిగిందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. తన తూర్పు మధ్యధరా సైనిక చర్యల సమయంలో సూలా ఈ అధునాతన ఆయుధాన్ని, దాని టెక్నాలజీని పొంది ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. పాలిబోలోస్ అనేది ఒకేసారి అనేక బాణాలను వేగంగా సంధించగల రిపీటింగ్ కాటపల్ట్. గ్రావిటీ ఫీడ్ మ్యాగజైన్ సహాయంతో బాణాలను ఆటోమేటిక్‌గా లోడ్ చేసుకుని నిరంతరాయంగా దాడి చేయగల సామర్థ్యం దీనికి ఉంది. ఈ ఆయుధానికి సంబంధించిన భౌతిక అవశేషాలు ఏవీ లభించనప్పటికీ, గోడలపై ఉన్న ఈ బాలిస్టిక్ గుర్తులే దాని వాడకానికి బలమైన సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇప్పటివరకు కేవలం గ్రంథాల్లో మాత్రమే ప్రస్తావన ఉన్న పాలిబోలోస్ ఆయుధం వాస్తవంగానే ఉనికిలో ఉండేదని ఈ పరిశోధన నిరూపించింది. ఈ వివరాలు ఎండీపీఐ (ఎండీపీఐ) జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

ఢిల్లీ: అరేబియా సముద్రంలో క్షిపణి విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు భారత, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి నోటమ్ (నోటీసెస్ టు ఎయిర్‌మెన్) జారీ చేశాయి. క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇరుదేశాలు తెలిపాయి. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని ఆయా దేశాలు నోటమ్, మారిటైమ్ అడ్వైజరీ వంటివి జారీ చేయడం సహజమే. అయితే ఇప్పుడు రెండు దేశాలు ఒకేసారి నోటమ్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది. ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. 200 కిలోమీటర్ల మేర క్షిపణి విన్యాసా జోన్‌గా పాకిస్థాన్ ప్రకటించింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ విన్యాసాలకు హెచ్చరికలు జారీ చేసింది. భారత్ 400 కిలోమీటర్ల మేర క్షిపణుల విన్యాసం కోసం జోన్‌గా ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన సంవత్సరం తర్వాత ఇరుదేశాలు ఆయుధ పరీక్షలపై ప్రకటన చేయడం గమనార్హం.

## చిన్న గెలాక్సీలలోనూ బ్లాక్ హోల్స్..
## భారత శాస్త్రవేత్తల పరిశోధనలో కొత్త కోణం

ఈ పరిశోధన భవిష్యత్ టెలిస్కోపుల ద్వారా చేసే అధ్యయనాలకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుందని వ్యాఖ్య

ఢిల్లీ: విశ్వంలో అతిపెద్ద గెలాక్సీల కేంద్రాల్లోనే కాకుండా అతి చిన్న గెలాక్సీలలోనూ కృష్ణబిలాలు (బ్లాక్ హోల్స్) ఉండే అవకాశం ఉందని భారత శాస్త్రవేత్తల తాజా అధ్యయనం వెల్లడించింది. మన పాలపుంత గెలాక్సీ చుట్టూ పరిభ్రమించే మరుగుజ్జు గోళాకార గెలాక్సీలలో మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు బలమైన ఆధారాలు ఉన్నాయని తమ డేటా సూచిస్తోందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వివరాలను సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ)కు చెందిన కె. ఆదిత్య, అరుణ్ మంగళం ఈ కీలక అధ్యయనం చేపట్టారు. వీరు నక్షత్రాలు, డార్క్ మ్యాటర్ హేలో, కేంద్రంలోని కృష్ణబిలం అనే మూడు గురుత్వాకర్షణ భాగాలతో కూడిన డైనమిక్ మోడళ్లను రూపొందించారు. అత్యంత నాణ్యమైన స్టెల్లార్ కైనమాటిక్ డేటాను ఉపయోగించి, ఈ గెలాక్సీలలో నక్షత్రాలు ఎలా కదులుతున్నాయో విశ్లేషించారు. ఒకవేళ ఆ గెలాక్సీ కేంద్రంలో కృష్ణబిలం ఉంటే, దాని ద్రవ్యరాశి అంచనా వేయడానికి ఈ సమాచారాన్ని ఉపయోగించారు. ఈ పరిశోధనపై అరుణ్ మంగళం మాట్లాడుతూ.. "మా మోడళ్లు, డేటాను పరిశీలించినప్పుడు ఈ మరుగుజ్జు గెలాక్సీలలోని కేంద్ర కృష్ణబిలాల ద్రవ్యరాశిపై కచ్చితమైన పరిమితులు విధించగలిగాం. సాధారణంగా వీటి ద్రవ్యరాశి పది లక్షల సౌర ద్రవ్యరాశుల కంటే తక్కువగా ఉంటుంది. కొన్ని గెలాక్సీలలో ఇంకా తక్కువ విలువలు ఉండే అవకాశం ఉంది. ఈ గెలాక్సీలలో కచ్చితంగా భారీ కృష్ణబిలాలు ఉండాలని మా డేటా చెప్పడం లేదు. కానీ, మధ్యస్థ పరిమాణ కృష్ణబిలాలు ఉండేందుకు మాత్రం మా డేటా పూర్తిగా అనుకూలంగా ఉంది" అని వివరించారు. పెద్ద గెలాక్సీల కేంద్రాలలో సూపర్‌మాసివ్ కృష్ణబిలాలను గుర్తించడం సాధారణమే. కానీ, పాలపుంత చుట్టూ ఉండే మరుగుజ్జు గెలాక్సీలు చాలా కాంతిహీనంగా, వాయువులు లేకుండా, డార్క్ మ్యాటర్‌తో నిండి ఉంటాయి. దీంతో వీటిలో కృష్ణబిలాలను నేరుగా గుర్తించడం అత్యంత కష్టతరం. ఈ నేపథ్యంలో తాజా అధ్యయనం గెలాక్సీలు, కృష్ణబిలాల పరిణామ సిద్ధాంతాలకు, భవిష్యత్ పరిశీలనలకు చాలా ముఖ్యమైందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భవిష్యత్తులో ఐఐఏ ప్రతిపాదించిన నేషనల్ లార్జ్ ఆప్టికల్ టెలిస్కోప్ , ఎక్స్‌ట్రీమ్లీ లార్జ్ టెలిస్కోప్ వంటి అత్యాధునిక పరిశీలనా సౌకర్యాలు రాబోతున్నాయి. ఇవి అతి తక్కువ కాంతివంతమైన, చిన్న గెలాక్సీలలోని నక్షత్ర కదలికలను కూడా కచ్చితంగా కొలవగలవు. అలాంటి పరిస్థితుల్లో ఈ అధ్యయనంలో ప్రతిపాదించిన ఏకీకృత సంబంధం ఆ డేటాను విశ్లేషించడానికి ఒక బలమైన ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగపడుతుందని అరుణ్ మంగళం తెలిపారు.

## సభికులను నవ్విస్తూనే ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రియాంకా గాంధీ

ఢిల్లీ: వయనాడ్ ఎంపీగా లోక్‌సభలో అడుగుపెట్టిన ప్రియాంక గాంధీ వాద్రా తన తొలి ప్రసంగంతో పార్లమెంటును ఆకట్టుకున్నారు. శుక్రవారం 21 నిమిషాల పాటు సాగిన ఆమె ప్రసంగంలో వాగ్ధాటి, వ్యంగ్యం, రాజకీయ చతురత కలగలిసి కనిపించాయి. అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా చమత్కారాలు విసురుతూనే, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను సైతం నవ్వించి తనదైన ముద్ర కనబరిచారు. మహిళా రిజర్వేషన్లపై జరిగిన చర్చలో ప్రియాంక మాట్లాడుతూ.. తరచూ బీజేపీ విమర్శించే నెహ్రూ ప్రస్తావనను తెలివిగా వాడుకున్నారు. 'మహిళా హక్కులకు పునాది వేసింది నెహ్రూ అనే వ్యక్తి. కంగారుపడకండి.. మీరు భయపడే జవహర్‌లాల్ నెహ్రూ గురించి నేను చెప్పడం లేదు, ఇది చరిత్ర' అంటూ మోతీలాల్ నెహ్రూ రిపోర్ట్‌ను ప్రస్తావించారు. 1928లోనే మహిళలకు సమాన హక్కుల ప్రతిపాదన జరిగిందని, 1931లో సర్దార్ పటేల్ అధ్యక్షతన కరాచీ సెషన్‌లో తీర్మానం నెగ్గిందని ప్రియాంక గుర్తుచేశారు. ప్రసంగం మధ్యలో హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. 'మీ వ్యూహాలు, ప్రణాళికలు చూస్తుంటే, ఒకవేళ ఈ రోజు చాణక్యుడు బతికి ఉంటే ఆయనే షాక్‌కు గురయ్యేవారు' అని ప్రియాంక అనగానే, అమిత్ షా గట్టిగా నవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. అదే సమయంలో, మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై ప్రియాంక తీవ్రంగా విరుచుకుపడ్డారు. డీలిమిటేషన్ పేరుతో ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఈ బిల్లును ప్రస్తుత రూపంలో ఆమోదిస్తే దేశంలో ప్రజాస్వామ్యమే మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసంగం ముగిసే సమయానికి సభలోకి వచ్చిన సోదరుడు రాహుల్ గాంధీ, ప్రియాంకను అభినందిస్తూ 'ఇదే వేగాన్ని కొనసాగించు' అని ప్రోత్సహించారు. మొత్తంమీద, తన తొలి ప్రసంగంతోనే ప్రియాంక గాంధీ లోక్‌సభలో ఒక బలమైన గొంతుకగా నిలవనున్నారనే సంకేతాలు స్పష్టంగా ఇచ్చారు.

## డీలిమిటేషన్‌తో అన్యాయం జరిగితే ఊరుకోం: లోక్‌సభలో మిథున్ రెడ్డి

అమరావతి: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై పార్లమెంట్ సాక్షిగా వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. గతంలో విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేక హోదా' ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో లేదంటూ తప్పించుకున్నారంటూ మండిపడ్డారు. ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో కూడా అదే తీరు పునరావృతమైతే సహించేది లేదని ఆయన తెగేసి చెప్పారు. డీలిమిటేషన్ అనేది దేశ నిర్మాణానికి ఉపయోగపడాలి తప్ప, ప్రతిపక్షాలను అణగదొక్కే సాధనంగా మారకూడదని ఆయన హితవు పలికారు. ముఖ్యంగా ఏపీలో లోక్‌సభ స్థానాల విషయంలో ఒక్క సీటు తగ్గినా, లేదా రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగేలా ఏ చిన్న అన్యాయం జరిగినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి సైతం ఇదే అంశంపై స్పందిస్తూ.. రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య సీట్ల కేటాయింపులో సమానత్వం ఉండాలని, అప్పుడే డీలిమిటేషన్‌కు అసలైన సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. సీట్ల పంపకాల్లో తేడాలు వస్తే పోరాటం తప్పదని పార్టీ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా ఈ ప్రక్రియ ఉండకూడదన్నదే వైసీపీ ప్రధాన డిమాండ్‌గా కనిపిస్తోంది.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రభుత్వం నట్టేట ముంచింది: కవిత

హైదరాబాద్: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడిని కల్వకుంట్ల కవిత మరింత ఉధృతం చేశారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను ప్రస్తుత ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆమె ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన కవిత, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోగా పీఆర్సీ అమలు చేస్తామన్న మాట ఏమైందని ప్రశ్నించిన ఆమె, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న వాగ్దానాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రాథమిక అవసరాలైన హెల్త్ స్కీం, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రిటైర్మెంట్ బకాయిల కోసం వృద్ధాప్యంలో ఉద్యోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఐదు వాయిదాల కరవు భత్యం ఊసే లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ఆమె ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నేడు రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు చేపట్టే నిరసన ప్రదర్శనలకు తెలంగాణ జాగృతి తరపున తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తాము అండగా ఉంటామని స్పష్టం చేస్తూ, ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును
# ఏకగ్రీవంగా ఆమోదించాలి

ఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ చరిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. చరిత్ర సృష్టించాలని ఆయన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఇది దేశంలోని సగం జనాభా అయిన మహిళలకు దక్కాల్సిన హక్కు అని, వారి శక్తికి కొత్త అవకాశాలు కల్పించాలని కోరారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలు కోసం ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ బిల్లును 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భవిష్యత్తులో జనాభా గణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తర్వాత ఈ రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "దయచేసి మీ మనస్సాక్షి చెప్పినట్టు నడుచుకోండి. మీ కుటుంబంలోని మహిళలను గుర్తుచేసుకోండి. ఇది మహిళలకు మనం ఇస్తున్నాం అనుకోకండి... యుగాలుగా వారికి నిరాకరించబడిన హక్కును తిరిగి ఇవ్వడం మన బాధ్యత అని గుర్తించండి" అని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదం ఘనతను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని, తనకు క్రెడిట్ అవసరం లేదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం లోక్‌సభలో ఈ బిల్లులపై చర్చ కొనసాగుతుండగా, శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. ఈ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందితే దేశ ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ప్రధాని పేర్కొన్నారు.

## 20 ఏళ్లలో నేను చేయలేనిది..
## ప్రియాంక 5 నిమిషాల్లో చేసింది

మొదటి పేజి తరువాయి

ప్రియాంక కేవలం ఐదు నిమిషాల్లో సాధించిందని సరదాగా వ్యాఖ్యానించారు. రాజకీయ జీవితంలో ఆమె నుంచి తాను చాలా నేర్చుకోవాల్సి ఉందని బహిరంగంగా అంగీకరించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలతో సభలో నవ్వులు విరిశాయి. "నేను 20 ఏళ్లలో చేయలేని పనిని మా సోదరి 5 నిమిషాల్లో చేసి చూపించింది. ఆమె ప్రసంగం చూసి చాలా గర్వపడ్డాను. ఆమె హోంమంత్రి అమిత్ షాను నవ్వించారు" అని రాహుల్ అన్నారు. నేడు మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చలో ప్రియాంక గాంధీ ప్రభుత్వంపై గట్టిగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశిస్తూ.. "ఈనాటి రాజకీయ చాణక్యాన్ని చూసి చాణక్యుడు బతికుంటే ఆశ్చర్యపోయేవారు" అని చురకలు అంటించగా, అమిత్ షా నవ్వారు. లోక్‌సభలో మూడు కీలక బిల్లులపై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్, తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ... తనకు, ప్రధానమంత్రికి కుటుంబ సమస్యలు లేవంటూ మరో చమత్కారం విసిరారు. దీంతో సభ్యులంతా మరోసారి పగలబడి నవ్వారు. ఈ సందర్భంగా 'నారీశక్తి'ని ప్రశంసించిన రాహుల్, ప్రతి ఒక్కరి జీవితంలో మహిళలు ముందుండి నడిపే శక్తిగా ఉంటారని కొనియాడారు. తన చిన్నతనంలో చీకటంటే భయపడినప్పుడు, తన నాయనమ్మ జీవిత సత్యాలు నేర్పి ధైర్యం చెప్పిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు.

# నాసిక్ టీసీఎస్‌లో బలవంతపు మతమార్పిడి..

మొదటి పేజి తరువాయి

మూలాలను గుర్తించేందుకు దర్యాప్తు సంస్థలను రంగంలోకి దింపుతామని హెచ్చరించారు. ఈ ఘటన అత్యంత తీవ్రమైనదని, దీని వెనుక పెద్ద ముఠా ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా వెల్లడైందని అన్నారు. సంస్థలో జరిగిన ఈ ఘటనను గుర్తించినందుకు ఆయన టీసీఎస్‌ను అభినందించారు. కంపెనీ యాజమాన్యం కూడా ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిందని, పోలీసులకు దర్యాప్తులో సహకరిస్తోందని తెలిపారు. ఈ ఘటనకు మూల కారణాలు తెలుసుకోవడానికి పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారని తెలిపారు. ఈ ఘటనకు కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టబోమని హెచ్చరించారు. పోలీసులు ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారని అన్నారు.

బాధితురాలు పలుమార్లు ఫిర్యాదు చేసింది: నాసిక్ పోలీస్ కమిషనర్

ఈ ఘటనకు సంబంధించి నాసిక్ పోలీస్ కమిషనర్ సందీప్ కార్నిక్ మాట్లాడుతూ, బాధితురాలు తన సమస్యపై పలుమార్లు హెచ్ఆర్ విభాగానికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని అన్నారు. పైగా పని ప్రదేశాల్లో ఇలాంటివి సహజమని చెప్పి ఆమెను పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. నిందితులకు అతివాద భావజాల గ్రూపులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

## తేజస్వి సూర్యపై చర్యలు తీసుకోవాలంటూ పొన్నం లేఖ..
## డీజీపీ స్పందన ఏమిటంటే..!

హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యల దుమారం ఇప్పుడు న్యాయపరమైన మలుపు తిరిగింది. పార్లమెంట్ వేదికగా తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చిన తేజస్విపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి లేఖ రాశారు. అయితే, ఈ లేఖపై స్పందించిన డీజీపీ, చట్టసభల పరిధిలో జరిగే చర్చలపై పోలీసులకు ఉండే పరిమితులను స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యులు మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసు విభాగానికి ఉండదని ఆయన తేల్చిచెప్పారు. మరోవైపు, మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం తన పోరాటాన్ని ఆపడం లేదు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఇంతలా కించపరుస్తుంటే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు నోరు మెదపకపోవడం శోచనీయమని ఆయన మండిపడ్డారు. డీలిమిటేషన్‌పై జరిగిన చర్చలో తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచాయని, ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, ఒక ప్రాంత చరిత్రను కించపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజి తరువాయి

పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

## మహిళా బిల్లుతో నవశకం..
## ఏపీలో మాత్రం 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది

అమరావతి: దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చిన ఈరోజు దేశ చరిత్రలో ఒక గొప్ప రోజని వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని కొనియాడారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ బిల్లుతో దేశ భవిష్యత్తు మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చని, ఇప్పటికే వైసీపీ ఈ బిల్లుకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. మహిళల అభివృద్ధి కోసం సామాజిక సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని, ఆయన హయాంలో అమలైన 90 శాతం పథకాలు మహిళా సాధికారత కోసమే రూపొందించబడ్డాయని ఆమె పేర్కొన్నారు. అయితే, ఇదే సమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విడదల రజని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిపోయిందని, మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. "జగనన్న హయాంలో దిశ యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, జీరో ఎఫ్ఐఆర్ వంటి వినూత్న కార్యక్రమాలతో మహిళలకు భద్రత కల్పిస్తే... నేడు చంద్రబాబు హయాంలో కేవలం 'రెడ్‌బుక్' పాలన మాత్రమే సాగుతోంది" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్, చంద్రబాబులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారిని వెనక్కి తెచ్చారా? అని నిలదీశారు. మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడుతున్న కూటమి ఎమ్మెల్యేలు, నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రజని ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు వస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో వారి రక్షణను గాలికి వదిలేయడం శోచనీయమన్నారు.

## దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో
# తెలంగాణ అగ్రగామిగా ఉంది

మొదటి పేజి తరువాయి

తెలంగాణ అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. వానాకాలం యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని వారు కేంద్రమంత్రిని కోరారు. 2025-26 సీజన్ కు గాను యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ధాన్యం సేకరణ, కేంద్ర ప్రభుత్వం వాటా సంబంధిత అంశాలపై కేంద్రమంత్రితో వారు చర్చించారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని వారు కోరారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి చెప్పారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి గారి ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. 201415 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ. 1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని శ్రీ ప్రహ్లాద్ జోషి గారికి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని పేర్కొంటూ వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి గారు, సెక్రటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ సింగ్ గారితో పాటు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## దక్షిణాదికి అన్యాయం జరగదు..
## రేవంత్ ఫార్ములా వెనుక అసదుద్దీన్: కిషన్ రెడ్డి

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణలో సాగుతున్న ప్రచారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో మీడియా ముఖంగా మాట్లాడిన ఆయన... ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ 'నార్త్ వర్సెస్ సౌత్' వివాదాన్ని సృష్టించేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సమన్యాయం చేస్తారని, జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన జరిగినా దక్షిణాది ప్రాధాన్యత తగ్గబోదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీలో సీట్లు 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కు, తమిళనాడులో 39 నుంచి 59కి పెరిగే అవకాశం ఉందని ఆయన గణాంకాలను వివరించారు. మరోవైపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై కూడా కిషన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మజ్లిస్ పార్టీ తన సీట్లు ఎక్కడ పోతాయో అన్న భయంతో మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోందని, ఆ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ ఫార్ములా అసలు ఆయనది కాదని, అది అసదుద్దీన్ ఓవైసీ వెనుక ఉండి చెప్పించిన ఫార్ములా అని ఆయన ఆరోపించారు. కేవలం హైదరాబాద్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందని అక్కడ సీట్లు పెంచమంటారా? అని ప్రశ్నించిన ఆయన... డబ్బున్న చోట ఓటు విలువ ఎక్కువగా ఉండాలని కోరుకోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నిలదీశారు. మహిళలను అణగదొక్కే రాజకీయాలకు ఎంఐఎం కేంద్ర బిందువుగా మారిందని, విపక్షాలన్నీ కలిసి మహిళా నాయకత్వాన్ని అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

## ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సంధుపై ట్రంప్ ప్రశంసలు

ఢిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందనడానికి అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు అత్యంత ఆప్తమిత్రుడని, ఆయన దేశం కోసం అద్భుతంగా పనిచేస్తున్నారని ట్రంప్ కొనియాడారు. ఇటీవల వీరిద్దరి మధ్య జరిగిన 40 నిమిషాల సుదీర్ఘ ఫోన్ సంభాషణలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధి పునరుద్ధరణ వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ఇదే క్రమంలో ఢిల్లీ నూతన లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జీత్ సింగ్ సంధుపై కూడా ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అమెరికాలో భారత రాయబారిగా సంధు అందించిన సేవలు ఇరుదేశాల బంధాన్ని బలోపేతం చేశాయని, ఆయన నేతృత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

## ఏపీకి మరో భారీ పెట్టుబడి..
## రూ.8,175 కోట్లతో లిథియం బ్యాటరీ ఫ్యాక్టరీ

అమరావతి: ఏపీకి మరో భారీ పెట్టుబడి వచ్చింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.8,175 కోట్ల వ్యయంతో లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ప్రముఖ సంస్థ వారీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమ కోసం ఏపీ ప్రభుత్వం 300 ఎకరాల భూమిని కేటాయించింది. మొత్తం 16 గిగావాట్ అవర్ సామర్థ్యంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో సెల్, ప్యాక్, స్టోరేజ్‌కు అవసరమైన బ్యాటరీలను తయారు చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 3,000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. మొదటి దశ పనులను 2027 జులై నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ భారీ పరిశ్రమ రాబోతోంది. ఇటీవల కాలంలో విశాఖకు ఐటీ, అనకాపల్లికి పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు వస్తున్నాయి. ఇక ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్న వారీ సంస్థకు గుజరాత్, అమెరికాలోని టెక్సాస్‌లో సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్లు ఉన్నాయి. సుమారు 30 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ అంతర్జాతీయంగా మంచి గుర్తింపు పొందింది. భవిష్యత్తులో ఈ ప్లాంట్‌ను మరింత విస్తరించాలని వారీ సంస్థ ప్రణాళికలు రచిస్తోంది. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) లిథియం అయాన్ సెల్స్, బ్యాటరీ ప్యాక్‌ల తయారీ సామర్థ్యాన్ని 20 గిగావాట్ అవర్ వరకు పెంచాలని భావిస్తోంది. విద్యుత్ నిల్వకు కీలకమైన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీపై దృష్టి సారించనుంది. దేశంలోనే ఇటువంటి ప్రాజెక్టులు పరిమితంగా ఉన్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఫ్యాక్టరీ కీలకపాత్ర పోషించనుంది.

## మమతా బెనర్జీ పాదయాత్రలో అనూహ్య ఘటన..
## దూసుకొచ్చిన యువకుడు

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరిన వేళ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యటనలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. పటిష్ఠమైన భద్రతా వలయం మధ్య ఆమె ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహిస్తుండగా, ఊహించని విధంగా ఒక యువకుడు రక్షణ కవచాన్ని ఛేదించుకుని నేరుగా ఆమె వద్దకు దూసుకురావడంతో తీవ్ర కలకలం రేగింది. అభిమానులకు అభివాదం చేస్తూ దీదీ ముందుకు సాగుతున్న సమయంలో, జనం మధ్య నుంచి మెరుపు వేగంతో వచ్చిన ఆ యువకుడు ఒక్కసారిగా ఆమె కాళ్లు మొక్కే ప్రయత్నం చేశాడు. అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామంతో మమతా బెనర్జీ దిగ్భ్రాంతికి లోనయ్యారు. భద్రతా సిబ్బంది తేరుకునేలోపే ఆ యువకుడు ముఖ్యమంత్రికి అత్యంత సమీపంలోకి వచ్చేయడంతో అక్కడ ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది అతడిని అడ్డుకుని పక్కకు లాగేశారు. గతంలో ఎన్నికల ప్రచార సమయంలో మమతా బెనర్జీ పలుమార్లు గాయపడిన చేదు అనుభవాలు ఉండటంతో, తాజా భద్రతా లోపం తృణమూల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన నింపింది.

## జగన్ దెబ్బకు భయపడిపోయిన సింగపూర్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అంటే సింగపూర్‌కు మొదటి నుంచీ సానుకూల దృక్పథం ఉండేదని, వైకాపా ప్రభుత్వం దాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టిన సింగపూర్ సంస్థల్ని అప్పటి సీఎం జగన్ తీవ్ర వేధింపులకు గురిచేసి వెళ్లగొట్టారని, దాంతో వాళ్లు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఆంధ్రప్రదేశ్‌కి రావాలంటే భయపడిపోయారని చెప్పారు. వారికి నచ్చజెప్పి మళ్లీ నచ్చజెప్పి రాష్ట్రానికి రప్పించేందుకు చాలా శ్రమపడాల్సి వచ్చిందన్నారు. సింగపూర్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్తమ పరిపాలనా విధానాలపై శిక్షణ కోసం ఈ నెల 21 నుంచి 27 వరకు ఆ దేశంలో పర్యటించనున్న రాష్ట్ర మంత్రులతో చంద్రబాబు గురువారం మధ్యాహ్నం విందు సమావేశం నిర్వహించారు. ఉత్తమ పరిపాలనా విధానాలు, అభివృద్ధిలో సింగపూర్ ప్రపంచానికి ఒక నమూనాగా నిలిచిందని సీఎం అన్నారు. ప్రజలకు ఇంకా వేగంగా, మెరుగ్గా, అవినీతికి తావులేకుండా ప్రభుత్వ సేవల్ని అందించేందుకు అమలు చేయాల్సిన విధానాల్ని సింగపూర్ పర్యటనలో అధ్యయనం చేయాలని మంత్రులకు సూచించారు. సింగపూర్‌లో తగినంత స్థలం లేకపోవడం వల్ల ప్రభుత్వం మలేషియాలో ఎకనమిక్ జోన్ అభివృద్ధి చేస్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. వైకాపా హయాంలో జగన్ రాజధానిపై కక్షకట్టకుండా, సింగపూర్ సంస్థల్ని తరిమికొట్టకుండా ఉంటే.. ఆ ఎకనమిక్ జోన్ అమరావతిలోనే అభివృద్ధి చేసేవారని ఆయన పేర్కొన్నారు.

సార్.. వాళ్లు మీ స్ఫూర్తితోనే షెడ్యూల్ రూపొందించినట్టున్నారు!

సింగపూర్‌లో శిక్షణ తరగతుల్ని ఉదయం 8 గంటలకే మొదలుపెట్టి రాత్రి 7 గంటలకు ముగించేలా షెడ్యూల్ రూపొందించడంపై మంత్రులు ఛలోక్తులు విసురుకున్నారు. 'సార్.. మీ నుంచి స్ఫూర్తి పొందే వారు అంత సుదీర్ఘంగా షెడ్యూల్ తయారు చేసినట్టున్నారు' అని ఒకరిద్దరు మంత్రులు సీఎంతో అన్నారు. పర్యటన తొలిరోజు ఉదయం 6.30 గంటలకు సింగపూర్‌లో విమానం దిగితే, ఉదయం 8.30 గంటలకే క్లాస్‌లు మొదలు పెట్టేస్తున్నారని వారు తెలిపారు. సీఎం స్పందిస్తూ.. కష్టపడాలని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయితేనే సమర్థంగా పనిచేయగలమని పేర్కొన్నారు.

# చిత్తూరులో మండుతున్న ఎండలు

## - కలెక్టర్ కీలక సూచనలు



చిత్తూరు, ఏప్రిల్ 17, (నేటి శుభోదయ) : వేసవి తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు.జిల్లాలో ఉష్ణోగ్రతలు 3640ళీజ మధ్య నమోదవుతున్నాయని, త్వరలో హీట్ వేవ్ అవకాశం ఉందన్నారు. తగినంత నీరు తాగి, ఎండలో తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

# వరసిద్ధి వినాయక దేవస్థానంలో దొంగల దోపిడి

## - లక్షన్నర రూపాయల నగదు చోరీ



ఒంగోలు, నేటి శుభోదయ ::: స్థానిక సీతారామపురం, ఉత్తరము వైపునుండి శ్రీగిరి స్కందగిరి వెళ్ళే మార్గం మొదలులో... శ్రీగిరి పై ఉన్న జేసీ గృహమునకు కూతవేటు దూరములో ఉన్న, శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో శుక్రవారము (ఏప్రిల్ 17 తేదీ) వేకువన దొంగలు పడి సుమారు ఒకటిన్నర లక్షల రూపాయలు దోచుకున్నారు. అక్కడికి దగ్గరలో ఉన్న వేప అంకమ్మ తల్లి దేవస్థానంలో కూడా దోచుకోవడానికి దొంగలు ప్రయత్నించారని అక్కడ ఉన్న కొన్ని ఆధారాలను బట్టి తెలిసింది. స్థానిక భక్తులు ప్రజలు తెలిపిన విధంగా శుక్రవారం వేకువన మూడు గంటల సమయంలో దొంగలు ఆలయ హుండీని తెరచి సుమారు హుండీలో ఉన్న ఒకటిన్నర లక్షల రూపాయలను దోచుకోవడం జరిగిందని, ఈ ఆలయం దాదాపుగా 70 సంవత్సరాలుగా అలారారుచున్నదని, ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలందరూ ఎంతో మతసామరస్యంతో పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వినాయక చవితి పర్వదినం నాడు ఎంతో శోభాయమానంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతి గణపతి నవరాత్రి ఉత్సవాల సమయంలో ఈ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని హుండీని తెరచి భక్తులు వేసిన కానుకలను భక్తుల సహకారంతో ఎంతో వైభవంగా ఆలయ కేంద్రంగా గణపతి నవరాత్రులు నిర్వహించడం జరుగుతుందని, గత 8 నెలలుగా హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు సుమారు ఒకటిన్నర లక్షల రూపాయలు ఉంటాయని వాటన్నిటిని దొంగలు దోచుకుపోవడం జరిగిందని, ఈ ప్రదేశంలో దాదాపు రాత్రి 1:00 వరకు ప్రజల సంచారం ఉంటుందని ఈ దొంగతనం ఒకటి తరువాత జరిగి ఉంటుందని తెలిపారు. ఈ సీతారాంపురం పరిధిలో సీసీ కెమెరాలు లేకపోవడం మరియు పోలీస్ గస్తీ తక్కువగా ఉండటం వలన దొంగలకు ఈ ఆలయ హుండీ దోచుకోవడం సులభమైనదని కనుక సీసీ కెమెరాలు ఏర్పాటు, పకడ్బందీగా పోలీస్ గస్తీ ఏర్పాటు చేయడంతో ఈ సీతారాంపురం పరిధి రక్షణ పరంగా బలీయంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా కూడా హిందూ ఆలయాలను దోచుకోవడం పరిపాటిగా మారిందని కనుక పోలీస్ శాఖ ఈ దొంగలను పట్టుకొని శిక్షించాలని హిందూ ఆలయాల రక్షణకు, హిందువుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండడానికి తగిన విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సీతారాంపురం ప్రజలు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి భక్తులు కోరుచున్నారు.

# నేడు శ్రీగిరిలో వసంతోత్సవం

## - వసంతోత్సవం కరపత్రాలను ఆవిష్కరించిన శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి



ఒంగోలు, నేటి శుభోదయ ::: ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వసంతోత్సవం కార్యక్రమాన్ని ఈ నెల 18 వ తేదీ శనివారం ప్రముఖ వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు



శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు,శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ 18 వ తేదీ ఉదయం 8 గంటల 30 నిమిషాలకు శ్రీవారికి . విశేష స్నపన తిరు మంజనం , సాయంత్రం 6 గంటలకు శ్రీవారి వసంతోత్సవం, 7.30 లకు ఊంజల సేవ, బొల్లాపల్లి ఫణి దీప్తి చే గాత్ర కచేరీ జరుగుతాయనీభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

# పంచాయతీల అభివృద్ధికి రూ.25కోట్ల నిధులు

## - గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## -అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే




గుడివాడ, ఏప్రిల్ 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఏపీలో పంచాయతీల అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతి నియోజకవర్గానికి 25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయడం చాలా గొప్ప విషయం అని గుడివాడ ఎమ్మెల్యే రాము హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్న డిప్యూటీ సీఎం, సీఎంకు ప్రజల తరపున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.పంచాయతీరాజ్ శాఖ నుండి గుడివాడ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి మంజూరు కానున్న 25 కోట్ల నిధుల వినియోగంపై అధికారులు, కూటమి నాయకులతో ప్రజా వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే రాము సమావేశం అయ్యారు. అన్ని గ్రామాలకు సమన్యాయం జరిగేలా, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా గ్రామ స్వరాజ్య సాధనే లక్ష్యంగా , గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల వారీగా ప్రాధాన్యతా పనుల జాబితా సిద్ధం చేశామన్నారు.పారదర్శకంగా ప్రతి రూపాయి ఖర్చు చేస్తామని, అభివృద్ధి పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తి రాలేదని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. ప్రతి పంచాయతీకి సమన్యాయం జరిగేలా నిధులు కేటాయించామన్నారు. ప్రధానంగా కమ్యూనిటీ హాల్స్, అంగన్వాడి భవనాలు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు తదితర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామ స్వరాజ్య సాధనే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లక్ష్యమని,ఆ దిశగా ఈ నిధులు పంచాయతీల రూపురేఖలు మార్చడంలో దోహదపడతాయన్నారు. ప్రజలంతా అధికారులకు సహకరించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. రూరల్ మండలంలో రూ.8.62కోట్లు,నందివాడ మండలంలో రూ.8.05కోట్లు, గుడ్లవల్లేరు మండలంలో రూ.8.33 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే రాము వెల్లడించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఏ.ఈలు సూరిబాబు, నాగేశ్వరరావు, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, నందివాడ మండల టిడిపి అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి,డీసీ చైర్మన్లు మళ్లీపెద్ది సుబ్రమణ్యం, ఆంజనేయులు, సర్పంచ్ రాధాకృష్ణ, కూటమి నాయకులు సీతయ్య, అంజిరెడ్డి, పేర్ని జగన్, బాబిరెడ్డి, పలువురు పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత

## -అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

## -50మందికి రూ.48,10,441లు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం



అవనిగడ్డ, ఏప్రిల్ 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు యాభై మందికి రూ.48,10,441లు విలువైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 1,318 మందికి రూ.10.89 కోట్లు సీఎంఆర్ఎఫ్ సహాయం అందించినట్లు ఎమ్మెల్యే వివరించారు. నిరుపేదలు తమ వైద్య అవసరాల కోసం ప్రభుత్వ సహాయం కోరుతూ సమర్పించే దరఖాస్తులను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎల్ఓసీలు, రీ-ఎంబర్సుమెంట్ సహాయం అందిస్తోందని తెలిపారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభించిన కార్పొరేటర్ మక్బుల్

## - గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు 14 ఏళ్ల బాలికలకు టీకా



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని ముస్తఫా నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ప్రతి కుటుంబం ఈ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను గుర్తించి, తమ పరిధిలో ఉన్న 14 సంవత్సరాల బాలికలను తప్పనిసరిగా యూపీహెచ్సీకి తీసుకువచ్చి టీకా వేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో ఈ వ్యాధిని నివారించవచ్చని చెప్పారు.ఈ కార్యక్రమంలో యూపీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని బాలికలను కేంద్రానికి తీసుకువచ్చి టీకాలు వేయించారు.ఈ కార్యక్రమం ద్వారా బాలికల ఆరోగ్య పరిరక్షణకు మరింత బలపడుతుందని వైద్య సిబ్బంది తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన



పులిచెర్ల, ఏప్రిల్ 17,(నేటి శుభోదయ) :ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య అన్నారు. చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం మంగళంపేట ఆదర్శ పాఠశాలలో శనివారం హెచ్ఎం మోహన్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ప్రభుత్వం కొత్త విధానంలో మంగళంపేట ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చడం. ప్రతి తరగతి ఉపాధ్యాయులు ఉండడంతో విద్యార్థుల చేరిక బాగా పెరిగింది. ఈ ఉత్సాహం వార్షికోత్సవం సందర్భంగా తల్లిదండ్రులలో కనబడుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి తమ పిల్లలను ఆదర్శ పాఠశాలలోని చేర్పిస్తామని అక్కడికి వచ్చిన తల్లిదండ్రులు చెప్పడం ఉపాధ్యాయులలో ఆనందం నింపింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం ఫజురుల్ల, హెచ్ఎం హరి శంకర్, రిటైర్డ్ హెచ్ఎం శంకర్ చక్రధర్ బాబు, మాజీ సర్పంచ్ మధు, పూర్వ విద్యార్థులు మునిరాజు, గోపాల్ విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# పింఛన్ కోసం దళితుడు నిరసన

## - రెండు రోజులు గడువు కోరిన పులిచెర్ల ఎంపీడీవో




పులిచెర్ల, ఏప్రిల్ 17,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం రాయవారి పల్లి పంచాయతి పుచ్చులవారిపల్లెకు చెందిన మునిరత్నం పింఛన్ ను ఎంపీడీవో రాజశేఖర్ బాబు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మునిరత్నం పింఛన్ ఎందుకు రద్దు చేశారని నిరసనకు దిగడంతో ఎంపీడీవో రాజశేఖర్ బాబు సోమవారం వరకు గడువు ఇవ్వండి పింఛన్ విషయం మాట్లాడతాం అని చెప్పడంతో మునిరత్నం అలానే ఇంటికి వెళ్లారు.

# రెండుసార్లు ఎమ్మెల్యే, పోలిట్ బ్యూరో సభ్యునిగా సమర్థ నాయకత్వం

## -బొండా ఉమామహేశ్వరరావుకు రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఘన సత్కారం

## -సంక్షేమం, అభివృద్ధి రెండింటిలోనూ ముందున్న నాయకులు బొండా ఉమామహేశ్వరరావు



విజయవాడ, ఏప్రిల్ 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమై తన కృషి, నిబద్ధతతో ఎదిగి నాయకుడిగా నిలిచిన బొండా ఉమామహేశ్వరరావు పార్టీకి అపార సేవలు అందించారని ఎన్. టి. ఆర్. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దే అనురాధ పేర్కొన్నారు.శుక్రవారం సింగ్ నగర్ లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలోతెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా కు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించిన సందర్భంగా తెదేపా ఎన్. టి. ఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దే అనురాధ శాలువా కప్పి ఘనంగా సత్కరించిన అనంతరం మాట్లాడుతూ కార్యకర్తలను ప్రోత్సహిస్తూ, వారిని నాయకులుగా తీర్చిదిద్దడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు, తెలుగుదేశం పార్టీ బలాన్ని ప్రజల్లో చాటి చెప్పి, ప్రతి ఎన్నికలో పార్టీ విజయానికి కృషి చేసిన నేతగా నిలిచారని అన్నారు.రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన పోలిట్ బ్యూరో సభ్యునిగా కూడా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని, గెలుపు-ఓటములకు అతీతంగా ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటారని చెప్పారు, సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు సొంత ఇంటి బిడ్డలాగా ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఉదయం నుండి రాత్రి వరకు ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలను పరిష్కరించే ప్రజానాయకుడిగా ఆయన పేరు సంపాదించారని తెలిపారు. 2024 ఎన్నికలలో ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక మెజారిటీతో గెలుపొందటం ద్వారా రికార్డు సృష్టించారని, ఆ విజయంతోనే ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందారని పేర్కొన్నారు, గెలుపొందిన తర్వాత కూడా సెంట్రల్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే రు.350 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తూ, డివిజన్ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తూ, ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెద్దపీట వేస్తూ అనేకమందికి నామినేటెడ్ పదవులు అందజేసిన నాయకుడిగా ఆయన నిలిచారని గద్దె అనురాధ తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి నిత్యం సేవలందిస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్న నాయకుడిగా బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు, ఇలాంటి నాయకత్వాన్ని గుర్తించిన రాష్ట్ర పార్టీ అధిష్ఠానం వారికి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి అప్పగించడం ఎంతో సముచితమని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులు అలంకరించి రాష్ట్రానికి, పార్టీకి మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పార్లమెంట్ కమిటీ సభ్యులు షేక్ గౌసియా కార్యదర్శి, గరిమెళ్ళ రాధిక కార్యదర్శి, పలగాని భాగ్యలక్ష్మి కార్యనిర్వాహక కార్యదర్శి, వింజమూరి సతీష్ అధికార ప్రతినిధి లను సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులు ఆరోగ్యం పై శ్రద్ధ చూపండి

## - మరణించిన జర్నలిస్టులు కాలువ రమణ ఆంధ్రజ్యోతి రవికుమార్ కుటుంబాలకు సహాయం చేస్తాం

## - వర్కింగ్ జర్నలిస్టులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ రవికాంత్ రమణ మచ్చా రామలింగారెడ్డి

## - అనంత జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



అనంతపురం, నేటి శుభోదయ ::: వర్కింగ్ జర్నలిస్టులు నిత్యం పని ఒత్తిడితో ఉండడం వల్ల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా ప్రమాదకరమని జర్నలిస్టులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మేలు జరుగుతుందని వర్కింగ్ జర్నలిస్టులు అందరూ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీ జర్నలిస్ట్ డెవలప్మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ కార్యాలయం నందు జిల్లా వర్కింగ్ జర్నలిస్టులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మీనాక్షమ్మ ఫౌండేషన్ చైర్మన్ రవికాంత్ రమణ, డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, సమాచార శాఖ ఏడి బాలకొండయ్య, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, మారుతి ,షేక్ బికారి, కుళాయి, స్వామి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉండాలన్న ఉద్దేశంతో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తున్నామని అందుకే కార్యక్రమాలు నిర్వహించామని ఐ క్లినిక్ కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇటీవల మరణించిన ఆంధ్రజ్యోతి రవికుమార్, సీనియర్ జర్నలిస్ట్ కాలువ రమణ కుటుంబాలను జిల్లా కలెక్టర్ ఆదుకోవాలని వారి కుటుంబాలకు ఉద్యోగం , ఇంటి పట్టా, ఇల్లు ఆర్థిక సహకారం అందించాలని మచ్చా రామలింగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ జర్నలిస్టు కుటుంబాలు ఆంధ్ర జ్యోతి రవికుమార్, కాలువ రమణ కుటుంబాలకు జిల్లా యంత్రాంగం తరపున కావాల్సిన సహకారం ఇవ్వడం జరుగుతుందని, పరిశీలించి వారి కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు ఎప్పుడూ జిల్లా యంత్రాంగం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందని, జర్నలిస్టులు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. ఇటువంటి కార్యక్రమం జర్నలిస్టులకు నిర్వహించడం వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి కృషి అభినందనీయమని అని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. రవికాంత్ రమణ మాట్లాడుతూ జర్నలిస్టులకు తమ సంస్థ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామని వచ్చే వారం పరీక్షలు ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని జర్నలిస్టులందరూ ఉపయోగించుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని రవికాంత్ రమణ అన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ను రవికాంత్ రమణాను జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ చేతులమీదుగా జర్నలిస్టు కుటుంబాలకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ జర్నలిస్టులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఆజాద్, ఫోటోగ్రాఫర్ మారుతి, మల్లికార్జున, రాము, బాలు, వేణుగోపాల్, శ్రీనివాస్ రెడ్డి, సాయి, మురళి, ప్రకాష్, కృష్ణబాబు, శ్రీనివాసులు, పెద్ద ఎత్తున జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## కేతవరం చోరీ కేసు లో దొంగ అరెస్ట్ రూ 2.30 లక్షల విలువైన

### బంగారం రూ 12వేలు నగదు స్వాధీనం

### మీడియా సమావేశం లో ఏ ఎస్ పి వెల్లడి




జంగారెడ్డిగూడెం ఏప్రిల్ 17 (నేటి శుభోదయ ప్రతినిధి కోసనం ప్రేమ్ కిరణ్): జంగారెడ్డిగూడెం -ఆంధ్రప్రభ జంగారెడ్డిగూడెం రూరల్ మండలం లోని కేతవరం లో ఇటీవల జరిగిన చోరీ కేసు లో నిందితుడు ముగ్గళ్ల శ్రీనివాస్ ను అరెస్ట్ చేశామని స్థానిక అడిషినల్ ఎస్ సుస్మిత రాఘవన్ తెలిపారు. అతని వద్ద రూ 2,30,820/-విలువ కలిగిన 102గ్రాముల బంగారం రూ 12 వేలు నగదు స్వాధీనపర్చుకున్నట్టు పేర్కొన్నారు శుక్రవారం ఇక్కడి పోలీస్ సర్కిల్ కార్యా లయం లో మీడియా సమావేశం లో ఏ ఎస్ పి పాల్గొన్నారు ఆమె మాట్లాడుతూ ఈ దొంగ తనం లో నేరస్తుడిని పట్టుకుని చోరీ సొత్తు రికవరీ కోసం జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్స్ పెక్టర్ ఎం వి సుభాష్ ఎస్ ఐ వీర ప్రతాప్ లక్కవరం ఎస్ ఐ ఎస్ కె జబీర్ ఏ ఎస్ ఐ సంపత్ కుమార్ మరో ముగ్గురు కానిస్టేబుళ్ల తో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దొంగ ను పట్టుకున్నామన్నారు అతని పై ఇరవై వరకూ పాత కేసులు వున్నాయని పేర్కొన్నారు అలాగే మరో అరు మోటార్ సైకిళ్లు కూడా రికవరీ చేసి నట్టు ఏ ఎస్ పి వివరించారు కాగా జిల్లా ఎస్ పి ఆదేశాలప్రకారం జంగారెడ్డిగూడెం పట్టణం పరిసరాల లో ను నైట్ గస్తీ కొన సాగుతున్నదని తెలిపారు ఆరు బయట నిద్ర పోయే వాళ్ళు అప్రమత్తం గా ఉండాలని తమ నగదు బంగారం లాకర్ లలో భద్ర పర్చుకోవాలని హెచ్చరించారు మీడియా సమావేశం లో దర్యాప్తు లోని బృందం కూడా పాల్గొన్నారు

## నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

### -జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ నియామకం పట్ల హర్షం




అమరావతి, ఏప్రిల్ 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను గన్నవరం ఎమ్మెల్యే మరియు ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసానికి వెళ్లిన ఆయన, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందని కొనియాడారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని మరింత శక్తివంతమైన రాజకీయ పక్షంగా తీర్చిదిద్దడంలో లోకేష్ కీలక పాత్ర పోషిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు టీడీపీ ద్వారా 1289 మంది ఎమ్మెల్యేలు, 149 మంది లోక్‌సభ సభ్యులు దేశానికి ప్రాతినిధ్యం వహించారని, 9 మంది కేంద్ర మంత్రులు, వందల సంఖ్యలో రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ మరియు శాసనమండలి సభ్యులను అలానే అనేక మంది ప్రజా నాయకులను దేశానికి అందించిన విశిష్ట గౌరవం తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. దేశ ప్రధానుల, రాష్ట్రపతి ఎంపికలోనూ, అలాగే లోక్‌సభ స్పీకర్, గవర్నర్ పదవుల భర్తీలోనూ టిడిపి కీలక పాత్ర పోషించిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు మహత్తర దూరదృష్టితో 44 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన క్రమశిక్షణ, విజన్‌తో అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని యార్లగడ్డ తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర బడ్జెట్‌ను 10 రెట్లు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడు దేనని ఆయన గుర్తు చేశారు. అంకితభావంతో శ్రమించే కార్యకర్తలే టిడిపికి అసలైన బలమని, అలాంటి గొప్ప వారసత్వం మరియు విలువలున్న పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేష్ బాధ్యతలు స్వీకరించడం ఒక గౌరవప్రదమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరిన్ని కొత్త శిఖరాలను అధిరోహించాలని యార్లగడ్డ వెంకట్రావు ఆకాంక్షించారు.

## జనగణన ను సమర్ధవంతంగా చేపట్టండి




పులిచెర్ల, ఏప్రిల్ 17,(నేటి శుభోదయ) :జనగణన ను సమర్ధవంతంగా చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కరుణకుమారి అన్నారు. చిత్తూరు జిల్లా, పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో జనగణన సిబ్బందికి జరిగిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి మాట్లాడుతూ జనగణనను నిబంధనలు మేరకు నిర్వహించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలు అతిక్రమించరాదని అన్నారు. స్వీయ గణనపై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ఇందుకు సిబ్బంది ముందుండాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో స్వీయ గణన కోసం పులిచెర్లలోని పలు గృహాలు వాణిజ్య సముదాయాలను సందర్శించి స్వీయ గణనపై స్వయంగా పరిశీలించారు. రిసోర్స్ పర్సన్స్ రాజేంద్ర, సయ్యద్ బాషా స్వీయ గణన, జన గణన గురించి అవగాహన కల్పించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కిషోర్ కుమార్ క్షేత్రస్థాయిలో స్వీయ గణనపై స్వయంగా నిర్వహణ విధానాన్ని చేపట్టి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్ బాబు, ఏఎస్ఓ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ముబారక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పులిచెర్ల వెలుగు ఏపీఎంగా కుమారస్వామి



పులిచెర్ల, ఏప్రిల్ 17,(నేటి శుభోదయ) :పులిచెర్ల మండలం వెలుగు ఏపీఎంగా కుమారస్వామి బాధ్యతలు చేపట్టారు. పులిచెర్ల ఏపీఎంగా ఉన్న చంద్రమోహన్ తవణం పల్లెకు బదిలీ కావడంతో చౌడేపల్లె మండలం ఏపీఎంగా ఉన్న కుమారస్వామి ని పులిచెర్ల మండలానికి బదిలీ చేశారు. ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంతో మహిళా సంఘాలను బలోపేతం చేస్తామని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకుంటూ మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా పథకాల అమలు చేస్తామని ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.

## భక్తులకు రుచికరమైన, శుచికరమైన అన్నప్రసాదం అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎం. హరిజవహర్ లాల్



విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- రాష్ట్ర దేవాదాయ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ డాక్టర్ ఎం. హరిజవహర్ లాల్ శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో దేవస్థానం అర్చక బృందం స్వాగతం పలికిన అనంతరం, వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనా నాయక్ కలిసి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.అమ్మవారి దర్శనం అనంతరం, హరిజవహర్ లాల్ దంపతులు దేవస్థాన అన్నప్రసాద వితరణ కేంద్రానికి చేరుకున్నారు. భక్తులతో కలిసి కూర్చుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాదం రుచి, నాణ్యత, వడ్డన తీరుపై భక్తులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడం పై వారు హర్షం వ్యక్తం చేశారు. అన్నప్రసాదశాల పరిశీలన అనంతరం, ఆలయ ఈవో, చైర్మన్లకు హరిజవహర్ లాల్ పలు కీలక సూచనలు చేశారు.అన్నప్రసాద వితరణ జరిగే ప్రాంతంలో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలని, వంటశాలలో నిరంతరం పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. వంటల తయారీలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, తాజా కూరగాయలు, నాణ్యమైన దినుసులను మాత్రమే వాడాలని స్పష్టం చేశారు. వంటశాలలో పనిభారాన్ని తగ్గించి, నాణ్యతను పెంచేందుకు అత్యాధునిక పరికరాలను వినియోగించాలని సూచించారు.అన్న ప్రసాదం స్వీకరించే భక్తుల సంతృప్తి స్థాయి పెంచేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్ర స్థాయిలో ప్రతి రోజు పరిశీలన చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భక్తులకు కడుపునిండా, తృప్తికరంగా భోజనం అందించడమే ప్రధాన ఉద్దేశమని, దీని కోసం అవసరమైతే 'దిట్టం' (మెనూ పరిమాణం) పెంచడానికి తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా, భక్తులు మెచ్చుకునేలా నిర్వహించాలని వారు ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. తమ కుమార్తె జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదాన పథకానికి డాక్టర్ హరి జవహర్ లాల్ విరాళం అందజేశారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో కిట కిట లాడింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దర్శనం సాఫీగా సాగుతోంది. నివేదన నిమిత్తం కొద్దిసేపు అంతరాలయ దర్శనాన్ని నిలిపివేశారు. సుమారు 15 నిమిషాల తర్వాత తిరిగి భక్తులను అంతరాలయ దర్శనానికి అనుమతించారు. భక్తులు ఎక్కడా వేచి ఉండాల్సిన అవసరం లేకుండా అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అమావాస్యతో కూడిన శుక్రవారం కావడం వలన ఆలయ అధికారులు భక్తుల దర్శన ఏర్పాట్లను వేగవంతం చేశారు. 15 నిమిషాల విరామం తర్వాత భక్తులను విడుదల చేయగా, క్రమ పద్ధతిలో దర్శనాలు కొనసాగాయి.


## నిర్మాణ వ్యర్థాలతో సంపద సృష్టించేందుకు సి అండ్ డి ప్లాంట్

విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- నగరంలోని నిర్మాణ వ్యర్థాలతో సంపదను సృష్టించేందుకు సిఎన్డి ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల బిల్డర్లు అందరూ అజిత్ సింగ్ నగర్ లో గల గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లోని సి అండ్ డి ప్లాంట్ కు నిర్మాణ వ్యర్థాలను పంపించాలని చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్ అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడున్నా సరే వాటిని అజిత్ సింగ్ నగర్ లో గల గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ లోకి తరలించని తమ సిబ్బందిని ఆదేశించారు. అక్కడున్న సిఎన్డి ప్లాంట్ని ఉపయోగించి నిర్మాణ వ్యర్థాలతో పాదచర్ల కోసం వేసే పేపర్ బ్లాక్స్, సిమెంట్ ఇటుకలు తయారుచేసి విజయవాడ నగరపాలక సంస్థ చేసే అభివృద్ధి పనుల్లో ఉపయోగిస్తున్నందున, ప్రజలకు కావాలన్నా విజయవాడ నగరపాలక సంస్థ వారు నుండి పొందవచ్చని అన్నారు. పట్టణ ప్రణాళిక సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రోన్ తో పర్యవేక్షిస్తూ నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా లేకుండా నిర్ధారించుకోవాలని అన్నారు. బిల్డర్లు నిభందనలు ఉల్లంగిస్తే చట్ట రీత్యా చర్యలో భాగంగా పెనాల్టీ తప్పవని అన్నారు.

## సెలవు రోజుల్లో కూడా పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- ప్రజల సౌకర్యర్థం నగరంలోని క్యాష్ కౌంటర్లు సెలవు రోజుల్లో కూడా అన్ని అందుబాటులో ఉన్నాయన్నారు విజయవాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయలపై 50% వడ్డీ రాయితీ, 2026- 27 సంవత్సరమునకు ఇంటి పన్ను ఖాళీ స్థలాల పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ, పండుగ రోజుల్లో కూడా ప్రజలు వినియోగించుకోగలరని అన్నారు. నగర పరిధిలో గల 13 క్యాష్ కౌంటర్లు, 286 సచివాలయాల్లో ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు సిబ్బంది ఉదయం అందుబాటులో ఉంటారని ప్రజలు పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఆన్లైన్లో ఈ వెబ్సైటు ఉఉఉ.ఎఎఎఉ.స్త్రశీజ.ఱఅ, ద్వారా చెల్లింపులు చేయవచ్చని, పురమిత్ర యాప్ ద్వారా కూడా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అన్నారు. ఈ అవకాశం కేవలం ఈ నెల 30 వరకు ఉన్నందున, ప్రజలందరూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన కోరారు.

## సంక్షేమం అభివృద్ధి రెండింటిలోనూ ముందున్న నాయకులు బొండా ఉమా, గద్దె అనురాధ



విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- అజిత్ సింగ్ నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.అనంతరం గద్దె అనురాధ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమై తన కృషి, నిబద్ధతతో ఎదిగి నాయకుడిగా నిలిచిన బొండా ఉమామహేశ్వరరావు పార్టీకి అపార సేవలు అందించారని పేర్కొన్నారు, కార్యకర్తలను ప్రోత్సహిస్తూ, వారిని నాయకులుగా తీర్చిదిద్దడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు, తెలుగుదేశం పార్టీ బలాన్ని ప్రజల్లో చాటి చెప్పి, ప్రతి ఎన్నికలో పార్టీ విజయానికి కృషి చేసిన నేతగా నిలిచారని అన్నారు.రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన పోలిట్ బ్యూరో సభ్యునిగా కూడా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని, గెలుపు-ఓటములకు అతీతంగా ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుంటారని చెప్పారు, సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు సొంత ఇంటి బిడ్డలాగా ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఉదయం నుండి రాత్రి వరకు ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలను పరిష్కరించే ప్రజానాయకుడిగా ఆయన పేరు సంపాదించారని తెలిపారు.2024 ఎన్నికలలో ఎన్టీఆర్ జిల్లాలో అత్యధిక మెజారిటీతో గెలుపొందటం ద్వారా రికార్డు సృష్టించారని, ఆ విజయంతోనే ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందారని పేర్కొన్నారు, గెలుపొందిన తర్వాత కూడా సెంట్రల్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే 350 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.అభివృద్ధితో పాటు పార్టీ బలోపేతంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తూ, డివిజన్ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తూ, ముఖ్యంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెద్దపీట వేస్తూ అనేకమందికి నామినేటెడ్ పదవులు అందజేసిన నాయకుడిగా ఆయన నిలిచారని అనురాధ తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి నిత్యం సేవలందిస్తూ, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్న నాయకుడిగా బొండా ఉమా ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు, ఇలాంటి నాయకత్వాన్ని గుర్తించిన రాష్ట్ర పార్టీ అధిష్టానం వారికి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి అప్పగించడం ఎంతో సముచితమని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులు అలంకరించి రాష్ట్రానికి, పార్టీకి మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పార్లమెంట్ కమిటీ సభ్యులు షేక్ గౌసియా కార్యదర్శి, గరిమెళ్ళ రాధిక కార్యదర్శి, పలగాని భాగ్యలక్ష్మి కార్యనిర్వాహక కార్యదర్శి, వింజమూరి సతీష్ అధికార ప్రతినిధి లను సత్కరించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు..

## ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

### ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గద్దె




విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బారులో తెలియజేసిన సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు.పటమట అశోక్ నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యాక్రమం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి తమ సమస్యలపై వినతిపత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించే విధంగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రజాదర్బార్‌లో ప్రజలు తెలియజేసిన సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా చూస్తారని, అందువల్ల ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా అధికారులు చూస్తారని, అందువల్ల ప్రజలు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా గద్దె కోరారు. ఈ కార్యక్రమములో ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, శిరీషా గాంధీ, పెనుగొండ శ్రీను, పీరుబాబు, కర్ణా కోటేశ్వరరావు, ముని కృష్ణ, పలు డివిజన్ల టి.డి.పి. అధ్యక్షులు, హౌసింగ్, విఎంసి అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు 'తెలుగుదేశం' కట్టుబడి ఉంది

### ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పార్టీ మహిళా ప్రజాప్రతినిధులతో ఎంపీ కేశినేని చిన్ని ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని వివరించారు. మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షల మేరకు 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేయడంలో తమ వంతు కృషి చేస్తామని కేశినేని చిన్ని పునరుద్ఘాటించారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్రను గుర్తించి, వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన పలువురు మహిళా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి




విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం కోళ్ల ఫారం రోడ్డు, భవానిపురం లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్ధాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవుకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు.ప్రతి శుక్రవారం తమ ఇంట్లో, ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టారీత్యా చర్యలు




విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- విజయవాడ కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు అన్నారు. సర్కిల్-3 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన కేసులు పై శుక్రవారం సర్కిల్-3 కార్యాలయం, పటమట లో ఏర్పాటుచేసిన మొబైల్ కోర్టులో విచారణ జరిపారు. న్యాయమూర్తి గోలీ లెనిన్ బాబు మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేసినా, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువులు ఉంచిన, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్టు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లగించిన 15 మందిపై విచారణ జరిపి రూ. 3,150/- జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏ ఎం ఓ హెచ్ 3 డాక్టర్ గోపాల్ నాయక్, శానిటరీ సూపర్వైజర్స్ రమేష్ బాబు, బాలాజీ శ్రీనివాస మూర్తి , శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించిన వీఎంసి ఫైర్ ఆఫీసర్స్



విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి ఫైర్ సేఫ్టీ వీక్ లో భాగంగా శుక్రవారం ఉదయం ఎన్ టి ఆర్ కాలనీలో రవీంద్ర భారతి నెక్ట్స్ జెన్ పాఠశాల లో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలను ఎలా నిరోధించాలి అనే అంశం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి, అగ్ని ప్రమాదం సంభవిస్తే రూమ్లో పొగ మొత్తం ఉన్నప్పుడు నేల మీద పాకుతూ ఎలా బయటికి రావాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ యఫ్ ఓ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, ఆటోనగర్ ఫైర్ ఆఫీసర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాల మిన్న

### మా బడిలో చేరండి మీ భవిష్యత్తు మాది



పులిచెర్ల, ఏప్రిల్ 17,(నేటి శుభోదయ) :మా బడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరండి బాగా చదువు చెప్తాం. ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తున్నది. మీ భవిష్యత్తు మాది. అని. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం కదిలారు. రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ఉపాధ్యాయులు పల్లె బాట పట్టాలని ఆదేశించారు.. ఈ క్రమంలో కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. విద్యా కమిటీ చైర్మన్. ఆశ్రూప్, హెచ్ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ బృందం విద్యార్థుల కోసం ప్రచారం చేపట్టారు. తొలుత కల్లూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు తో మాట్లాడి ఐదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో. విద్య బోధన వసతుల గురించి వివరించారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆశ్రూప్. మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలు మిన్నగా ఉన్నాయని అనవసరంగా ప్రైవేటు పాఠశాలల్లో డబ్బులు ఖర్చు పెట్టుకోకుండా మీ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మంచి భవిష్యత్తుకు నాంది పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

**- రేణిగుంట మండలం ఎర్రంరెడ్డి పాలెం తుక్కివాకం సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ యార్డులో భారీగా గంజాయి దగ్ధం**

**- సుమారు 4100 కిలోల గంజాయి పూర్తిగా నాశనం**

**- దాదాపు రూ.20 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల ధ్వంసం**

**- జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సమక్షంలో ప్రత్యేక ఎలక్ట్రికల్ యంత్రంతో దహనం**

తిరుపతి, నేటి శుభోదయ ::: తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసులకు సంబంధించిన మాదక ద్రవ్యాలను, రేణిగుంట మండలం పరిధిలోని ఎర్రంరెడ్డి పాలెం తుక్కివాకం సాలిడ్ వెస్ట్ డంపింగ్ డంపింగ్ యార్డులో చట్టపరమైన విధానాల ప్రకారం పూర్తిగా నాశనం చేయడం జరిగింది. మొత్తం సుమారు 4100 కిలోల గంజాయిని ప్రత్యేక ఎలక్ట్రికల్ యంత్రం సహాయంతో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సమక్షంలో దహనం చేయగా, దీని మార్కెట్ విలువ దాదాపు రూ.20 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిర్మూలనపై కఠినంగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక వ్యవస్థ ద్వారా ఐజీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో నియంత్రణ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని పేర్కొన్నారు. యువతకు అవగాహన కల్పించేందుకు లక్షమంది విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల్లో జిల్లాలో స్వాధీనం చేసుకున్న గంజాయిని నాలుగు వేల కిలోలకు పైగా దగ్ధం చేసినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలపై పోలీసులు నిరంతరం కఠిన చర్యలు తీసుకుంటున్నారని, గంజాయి వినియోగం యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. తిరుపతి వంటి ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో మాదక ద్రవ్యాలకు ఎలాంటి అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువతలో ఆరోగ్య సమస్యలు, మానసిక అస్వస్థత, చదువుపై నిర్లక్ష్యం, కుటుంబ సంబంధాల్లో విఘాతం వంటి అనర్థాలు కలుగుతాయి. అదనంగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు నేరప్రవర్తన వైపు మళ్లే ప్రమాదం ఉండటంతో సమాజంలో శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడుతుందని అన్నారు. అలాగే సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యం కీలకం గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్న వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు (పరిపాలన) రవి మనోహర చారి (శాంతిభద్రతలు), సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, ఈగల్, ఎక్సైజ్ శాఖ అధికారులు సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఆసియాలోనే అతిపెద్ద ఆసుపత్రి

**- గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చాలా పెద్ద గుండె ఆసుపత్రి**



అమరావతి, నేటి శుభోదయ ::: "యు. ఎన్. మెహతా ఆసుపత్రి" ప్రారంభించబడింది. ఇక్కడ 7 రోజులు అయ్యింది. కేవలం 15 వేల రూపాయలు మాత్రమే ఖర్చు చేస్తే అన్ని పరీక్షలు నిర్వహిస్తారు. కేవలం 7 లక్షల విలువైన చికిత్స జరిగింది. ఈసిజి ఉచితం, ఈసిఓ కేవలం 300 రూపాయల వరకు వసూలు చేసింది. యాంజియోగ్రఫీ రూ 6000 లు మాత్రమే. ఇక్కడ చాలా మంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి అందుబాటులో వైద్యులు ఉన్నారు. అన్ని ప్రదేశాల నుండి చికిత్స నిరాకరించబడిన ఎవరైనా ఒకసారి ఇక్కడకు వచ్చి చూడాలి. ప్రభుత్వ సహాయంతో, ఈ ఆసుపత్రి మానవత్వం కోసం ప్రారంభించబడింది. ధప్రస్తుత భారత ప్రభుత్వ ఆయుష్మాన్ కార్డు కూడా ఇక్కడ అంగీకరించ బడుతుంది. అన్ని పరీక్షలు కూడా నామమాత్రపు ధరలకు చేయబడతాయి. ఆసుపత్రిలోనే నిద్రించడానికి స్థలం ఉంది. ఆహారం కూడా అన్ని సమయాల్లో పూర్తిగా ఉచితంగా అందజేస్తారు. సంస్థ వాహనం ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు తిరిగి వస్తుంది. వారు అన్ని రకాల ఆహారాన్ని ఉచితంగా ఇస్తారు. ఇదే కాకుండా, ఇక్కడ ఒక క్యాంటీన్ కూడా ఉంది. దీనిలో మీరు ఒక ప్లేట్ ఆహారాన్ని పొందుతారు 50 రూపాయలు. ఆసుపత్రి వెలుపల అన్నపూర్ణ భవన్ ఉంది. రూ. 35 కి మంచి ఆహారం లభిస్తుంది. ఇక్కడ ఉదయం, సాయంత్రం రెండింటిలోనూ 6 మంది వేర్వేరు గుండె వైద్యులు ఉన్నారు. వారికి వారి స్వంతంగా చాలా పెద్ద బృందం ఉంది. డాక్టర్ జయేష్ ప్రజాపతి, శరద్ జైన్ మొదలైన వారు చాలా ప్రసిద్ధ వైద్యులు ఉన్నారు. ఏదైనా సమాచారం కోసం మీరు సంప్రదించవచ్చు 7974825740. కోమల్ ప్రజాపతి ఇండోర్ (జూలై 2023) యుఎన్ మెహతా హాస్పిటల్ సివిల్ ఏరియా అహ్మదాబాద్ గుజరాత్ ఆసుపత్రి నంబర్లు 9099955248, ధ9099955249 మీకు ఇది అవసరం లేకపోతే ఈ సందేశాన్ని అవసరమైన వారికి ఫార్వార్డ్ చేయండి. ఏదైనా పేద మధ్యతరగతి కుటుంబం దీనిని సద్వినియోగం చేసుకోగలిగేలా ఏర్పాటు చేశారు.

# ఎమ్మెల్యే బొండా ఉమాతో

## కలిసి వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న గద్దె అనురాధ



విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- అజిత్ సింగ్ నగర్ లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజల నుండి వినతిపత్రాల స్వీకరణ "ప్రజా దర్బార్ (గ్రా+=వా)" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ పాల్గొని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు, కార్యక్రమంలో కొంతమంది లబ్ధిదారులు తమకు ఉపాధి కోసం తోపుడు బండ్లు కావాలని తెలియజేయగా, ఎమ్మెల్యే బొండా ఉమ తక్షణమే అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొండా ఉమా ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ విజయవంతంగా నిర్వహించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు హాజరై తమ సమస్యలను తెలియజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో పెన్షన్లు, హౌసింగ్ స్థలాల కేటాయింపులు వంటి అంశాల్లో సరైన అమలు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేవలం పత్రాలు ఇచ్చి వాస్తవ లబ్ధి అందకపోవడం వల్ల ప్రజలు నష్టపోయారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు నేరుగా ఎమ్మెల్యేను కలిసే అవకాశం లభించడం వల్ల సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 70 శాతం మహిళలు పాల్గొనడం విశేషమని, కుటుంబ సమస్యలు, హౌసింగ్, ఉపాధి అవకాశాలు, సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం వంటి అంశాలపై మహిళలు తమ వినతులు సమర్పించినట్లు చెప్పారు. దివ్యాంగులు ప్రభుత్వం నుంచి నెలకు రూ.6000 పెన్షన్ అందుతున్నందుకు సంతోషం వ్యక్తం చేయగా, ఉపాధి కోసం కుట్టుమిషన్లు, ఇస్త్రీ బండ్లు వంటి సాధనాలు ఇవ్వాలని కోరిన వారికి ఎమ్మెల్యే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఒక విధవరాలు తన నాలుగు పిల్లలతో వచ్చి ఇల్లు కల్పించాలని కోరగా ఆమె పరిస్థితిని గమనించి తగిన సహాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రతి కుటుంబానికి "కూడు, గూడు, గుడ్డ" అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం నరేంద్ర మోదీ మద్దతుతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే వారు కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని, మహిళా రిజర్వేషన్ వంటి చర్యలు వారి పురోగతికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. బొండా ఉమా మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని బాధ్యతాయుతంగా స్వీకరిస్తూ ప్రతి అర్జీని ఆన్లైన్ ద్వారా ప్రభుత్వానికి పంపించి, వాటికి సరైన పరిష్కారం లేదా సమాధానం ఇవ్వడమే తమ లక్ష్యమని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గత సంవత్సరం నుండి నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో ప్రతి అర్జీకి సమాధానం ఇస్తూ జవాబుదారీతనంతో పనిచేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ హౌసింగ్ సమస్యలను తిరిగి పరిశీలించి అవసరమైన చోట ఇళ్ల మంజూరు చేస్తామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్ దరఖాస్తులను ఇప్పటికే ఆన్లైన్ ద్వారా పంపించామని, త్వరలోనే అవి మంజూరు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌గా గద్దె అనురాధ హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించగా, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ సహా ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, ఎన్ టిఆర్ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి ఎస్ కె గౌసియా, విజయ్ కృష్ణ బజార్ చైర్మన్ వెలగా సురేష్, జలకం రాజా, విజన్ ఏ2040 టీమ్, సిడిఓ జగదీశ్వరి తో పాటు ఎన్ డిఏ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమంపై ఆలోచన చేసింది తెలుగుదేశం పార్టీయే

### రాజకీయం, విద్య, ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించిన సియం నారా చంద్రబాబునాయుడు: ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, ఏప్రిల్ 17 (నేటి శుభోదయ):- మహిళా సంక్షేమం గురించి మొట్టమొదటిగా ఆలోచన చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం తూర్పులోని 4వడివిజన్, సీటీవో కాలనీలో రూ.40 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గద్దె ప్రారంభించారు. పార్కు, జిమ్ము, రీడింగ్ రూమ్ నిర్మాణ , అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతిపాదనలో ఉందని, నేడు కేంద్ర ప్రభుత్వం అంతిమ నిర్ణయం సుకోవడటం చాలా ఆనందంగా ఉందన్నారు. మహిళల సంక్షేమం గురించి ఆలోచన చేసిన మొదటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని, ఆ సంప్రదాయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కొనసాగించారని వివరించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, ఆస్తి హక్కులో వాటా ఇచ్చింది ఆనాడు ఎన్టీఆర్ అని, వారికి రిజర్వేషన్లను పెంచి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనని తెలిపారు. అనాడు అన్న నందమూరి తారక రామారావు మహిళల విద్య కోసం ప్రత్యేకంగా ఒక యూనివర్శిటీని స్థాపించారని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలను కూడా తమ ప్రభుత్వం మహిళల పేరునే ఇస్తున్నామన్నారు.

తమ కూటమి ప్రభుత్వం ఉద్యోగాల్లో, విద్యలో, డీఎస్సీలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. మహిళల శక్తిని మరింతగా పెంచి రాజకీయ శక్తి కల్పించడానికి మహిళా బిల్లును పార్లమెంట్‌లో చర్చించి ఆమోదించనున్నారన్నారు. ఆనాడు వాజ్‌పేయి సమయంలో కూడా మహిళా రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారని ఆ సమయంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నానని ఎమ్మెల్యే గద్దె గుర్తుచేసుకున్నారు. ఆనాడు పార్లమెంట్‌లో మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అందులోని అంశాలను చదువుతున్న సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు వచ్చి మహిళా బిల్లు ప్రతులను చించివేశారని గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును అడ్డుకోవాలని చూస్తుందని, ఆ విధంగా చేయడం వల్ల కాంగ్రెస్ పార్టీ భారీగా నష్టపోయిందని చెప్పారు. ఈ క్రెడిట్ అంతా మీరే తీసుకోండని ప్రధాన మంత్రి నరేంద్రమోడి కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం స్పష్టం చేశారని అయినా ఈ బిల్లును అడ్డుచెప్పడం సరికాదన్నారు.

దేశంలో ఎప్పటి నుంచో దీర్ఘకాలికంగా ఉన్న ఎన్నో సమస్యలను నరేంద్రమోడి పరిష్కరించారని చెప్పారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించాల్సిన అవసరం ఉందని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ ప్రజాక్షేత్రంలో ఫలితం చవిచూస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ పార్లమెంట్ సభ్యుడిగా, ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసిన అనుభవంతో నేను చేస్తున్న విజ్ఞప్తి ఏంటంటే ప్రస్తుత మహిళా బిల్లును ఆమోదించి మహిళలకు అన్నింటిలో అవకాశాలను కల్పించాలని, ఎమ్మెల్యే గద్దె కోరారు. జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ సీటీఓ కాలనీలో పార్కు, జిమ్, సచివాలయం పై అంతస్తులో రీడింగ్ రూమ్ నిర్మాణం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, వడ్లపట్ల గోపాలకృష్ణ, యేర్నేని వేదవ్యాస్, తంగళ్ళమూడి రవి, సురేంద్ర, వై.రాజేష్, రాజామణి, రామచంద్రారెడ్డి, ఎస్. వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఈఈ. సామ్రాజ్యం, ఏఈ.దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టాలి

### -ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్





గన్నవరం, ఏప్రిల్ 17( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మల్లవల్లి పారిశ్రామిక ప్రాంతానికి పూర్వ వైభవం వచ్చిందని అన్నారు. ఒకప్పుడు పొగాకు కు ప్రసిద్ధి చెందిన మల్లవల్లి, నేడు రాష్ట్రానికే తలమానికంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని గన్నవరం ఎమ్మెల్యే, విప్ యార్లగడ్డ వెంకట్రావ్ వివరించారు. బాపులపాడు మండలం మడిచర్ల లో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మీ బిడ్డల భవిష్యత్తు మారాలంటే పరిశ్రమలు రావడం ఎంతో అవసరమని ఆయన ఉద్ఘాటించారు. గ్రామాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని ఎజెండాగా పెట్టుకుని, ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గన్నవరం నియోజకవర్గం రాష్ట్రంలోనే మూడవ స్థానంలో ఉందని, రాబోయే కాలంలో దీనిని ప్రథమ స్థానానికి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు అందిన అర్జీలలో మెజారిటీ సమస్యలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. అధికారులకు ప్రజల సమస్యల పట్ల బాధ్యత ఉండాలని, సమస్య పరిష్కారం కాకపోతే దానికి గల కారణాలను స్పష్టంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. మడిచర్ల, కొయ్యూరు, కొత్తపల్లి, కొత్త మల్లవల్లి వంటి గ్రామాల్లో రోడ్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారిగా గన్నవరంలో బీకాం కంప్యూటర్స్, బీటెక్ చదివిన విద్యార్థుల కోసం హెచ్. సి. ఎల్. కంపెనీతో కలిసి 'ఏ 1 ఫ్రీ ట్రైనింగ్' వచ్చే నెల నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అశోక్ లేలాండ్ వంటి కంపెనీల ద్వారా సుమారు 920 మందికి, మొత్తం మీద నియోజకవర్గంలో 15,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ జోగేశ్వరరావు, తహసీల్దార్ మురళి కృష్ణ , గన్నవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి షేక్ షాహిద్ బాబు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, బాపులపాడు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, ఎన్.ఎస్.పి లెఫ్ట్ మెయిన్ కెనాల్ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, పిడికిటి రాంబాబు, మోటారు వాసు, దేవినేని సత్యనారాయణ, షేక్ జాన్ భాషా, తూమాటి సాంబశివరావు, ఆలూరి రామకృష్ణ, వి.ఎస్.ఆర్ కృష్ణ ప్రసాద్ (నాని), అక్కినేని ధర్మరాజు, కాకుమాను వెంకటేశ్వరరావు, వడ్డీ అశోక్, అక్కినేని కృష్ణాజీ, కాంద్రు అజయ్, అక్కినేని రవి, అక్కినేని కృష్ణాజీ, అవిర్నేని భవాని శంకర్, యంగ్ ప్రొఫెషనల్ పోతురాజు రాజేష్, మొవ్వ వేణుగోపాల్, కొల్లూరు చంద్రకాంత్, మాదల శ్రీనివాసరావు, కంపసాటి ప్రసాద్, బల్లమూడి కృష్ణ, కూకటి విజయ్ కుమార్, కొసరాజు సాయిరాం, బుస్సే నాగప్రసాద్, కొసరాజు సాయిరాం మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతుండగా మైక్ కట్



ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతున్న మహిళా ఎంపీ మై?క్ కట్ చేయడంపై వైఎస్సార్‌సీపీ ఎంపీలు తనూజ రాణి, గురుమూర్తి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మైక్ కట్ చేసిన సభాస్థానంలో టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ఉన్నారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ జరిగింది. వైఎస్సార్‌సీపీ తరఫున చర్చలో ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణి పాల్గొన్నారు. టీడీపీ హయాంలో మహిళలపై కొనసాగుతున్న హింసను ఆమె ప్రస్తావించారు. ఏపీలో మహిళను తొలిసారిగా ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రిని చేసిన ఘనత వైఎస్ జగన్‌ది. నామినేటెడ్ పోస్టుల్లో, కాంట్రాక్టుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌ది. అమ్మ ఒడి, మహిళల పేరుపైనే ఇళ్ల పట్టాలు ఇచ్చారు. 2019-24 వైఎస్ జగన్ పరిపాలనా కాలం మహిళలకు స్వర్ణయుగం లాంటిది. ఏపీలో మహిళలపై హింస జరుగుతుంది. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో జరిగిన ఘటన తీవ్ర ఆందోళనకరం. అధికార పార్టీలోని ప్రజాప్రతినిధులు మహిళలను వేధిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు" అని తనూజరాణి మండిపడ్డారు.

## ఈ బిల్లు అందుకే.. ఎట్టిపరిస్థితుల్లో అడ్డుకుంటాం



ఢిల్లీ: నారిశక్తి వందన్ అధినియం పేరుతో కేంద్రం తీసుకవచ్చిన బిల్లు వాస్తవానికి మహిళల రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు కానేకాదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు చర్చపై ఆయన శుక్రవారం పార్లమెంటులో మాట్లాడారు. 2023 లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని ఇది మహిళలను అడ్డుగా పెట్టి తీసుకొచ్చిన షేమ్ ఫుల్ యాక్ట్ అన్నారు. మా నానమ్మ ఇందిర వల్లే నాలో ఆత్మ విశ్వాసం పెరిగిందని నిన్న సభలో తన సోదరి ప్రియాంక గాంధీ చేసిన ప్రసంగం తనకు ఎంతో గర్వంగా అనిపించిందన్నారు.మన జీవితంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని తల్లులు చెల్లెలు , భార్య బిడ్డల రూపంలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తారన్నారు. కాగా ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో కేంద్రం ఎంతో కుట్ర చేస్తోందన్నారు. ఇది రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చాలనుకుంటున్న బిల్లు అని రాజ్యాంగాన్ని బైపాస్ చేసి నియోజకవర్గాలని పెంచాలనుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ బిల్లు వెనుక ఉన్న అసలు ఉద్దేశం కులగణన లెక్కలు లేకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్నదే అన్నారు. ఓబీసీలకు 15 ఏళ్ల పాటు రిజర్వేషన్లు లేకుండా చేసే కుట్ర ఇదన్నారు. బీజేపీ సభ్యులు రాజ్యాంగం కంటే మనువాదానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారుల్లో , న్యాయవ్యవస్థలో ఓబీసీలు గిరిజనులు లేరని, ప్రేవేటు రంగంలో కూడా రంగంలో కూడా ఓబీసీ ఎస్సీ ఎస్టీల ప్రాధాన్యత లేదన్నారు. హిందుత్వం పేరుతో బీజేపీ పార్టీ బీసీ, ఎస్సీ,ఎస్టీలకు చేసిందేమీ లేదన్నారు. కులగణనను బైపాస్ చేసేందుకే కేంద్ర యత్నిస్తోందని అస్సోం, జమ్మూలో చేసినట్లు డీలిమిటేషన్ చేయాలనుకంటున్నారని ఆరోపించారు. ఈ బిల్లు దేశవ్యతిరేఖ బిల్లని ఇది ఎట్టిపరిస్థితుల్లో ఆమోదం పొందేలా చేయడానికి బీజేపీ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. దేశ ఆత్మని చంపే బిల్లుని ఎట్టిపరిస్థితుల్లో అడ్డుకొని తీరాతమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తేల్చి చెప్పారు. కాగా రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పార్లమెంటులో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

## ఆ బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు



ఢిల్లీ: మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. నియోజకవర్గాల పెంపుపై ప్రభుత్వం చెబుతున్న విషయాలు లిఖితపూర్వకంగా బిల్లులో పెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రాంతీయ వ్యత్యాసాలు లేకుండా చూడాలని.. అన్ని పార్టీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని కోరారు. డీలిమిటేషన్ ప్రక్రియ విపక్షాలను అణచివేసేదిగా ఉండకూడదన్నారు. మహిళా రిజర్వేషన్‌కు సంపూర్ణ మద్దతిస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌ది. సంక్షేమ పథకాలన్నీటిని మహిళలకు భాగస్వామ్యం కల్పించారు. ఇళ్ల పట్టాలు మహిళల పేర్లతోనే ఇచ్చారు. నలుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు మహిళలను వేధిస్తూ పట్టుబడ్డారు. అసభ్యకరమైన వీడియోలు బయటపడ్డాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫిర్యాదు చేసిన మహిళపైనే కేసులు పెడుతున్నారు. మహిళలను వేధిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి. సూత్రప్రాయంగా ఈ బిల్లులను అంగీకరిస్తున్నాము. కానీ, మేము లేవనెత్తిన అన్ని అంశాలను ప్రభుత్వం నివృత్తి చేయాలి" అని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.ు

## ఆ ఘనత వైఎస్ జగన్‌దే: విడదల రజిని




తాడేపల్లి: ఇవాళ దేశ చరిత్రలో గొప్పరోజుగా మిగిలిపోతుందని.. దశాబ్దాల తర్వాత మహిళా రిజర్వేషన్ కల నెరవేరబోతుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. శుక్రవారం ఆమె తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు వైఎస్సార్‌సీపీ ఇప్పటికే మద్దతు ప్రకటించిందన్నారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుతో దేశ భవిష్యత్తు మారబోతుంది. మహిళా శక్తితో మన దేశాన్ని ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా చేద్దాం. మహిళల అభివృద్ధి గురించి ఆలోచించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 90 శాతం పథకాలు మహిళల గౌరవం పెంచే పథకాలే. అమ్మ ఒడి దగ్గర నుంచి ప్రతి పథకం మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేదే. మహిళలకు వైఎస్ జగన్ ఎన్నో అవకాశాలు కల్పించారు. మహిళలను హోం మినిస్టర్లగా, డిప్యూటీ సీఎంలుగా చేసిన ఘనత జగనన్నదే. మహిళల పట్ల వైఎస్ జగన్ సామాజిక సంఘ సంస్కర్తగా ఆలోచన చేశారు. కూటమి పాలనలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయి. ఏపీలో లా అండ్ ఆర్డర్ పని చేయడం లేదు. చంద్రబాబు అజెండా రెడ్‌బుక్ పాలనే" అని విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతకు అనేక కార్యక్రమాలు చేపట్టింది వైఎస్ జగనే. రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో చేయూత అందించారు. చంద్రబాబు వచ్చాక మహిళలకు రక్షణ లేదు. వేధింపులు, అఘాయిత్యాలు, ఆత్మహత్యలు పెరిగాయి. పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో పూర్తిగా దిగజారిందనేదానికి నిదర్శనం. మహిళల కోసమే జగన్ దిశ యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, జీరో ఎఫ్ఐఆర్ లు తెచ్చారు. కానీ చంద్రబాబు మహిళల కోసం ఏం చేశారు?. 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని మా హయాంలో ఆరోపణలు చేశారు. మరి నిజంగానే అదృశ్యమైతే వారిని చంద్రబాబు, పవన్ వెనక్కి తెచ్చారా?. మహిళల మీద లైంగికదాడి చేసిన కూటమి ఎమ్మెల్యేలు, నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అంటూ విడదల రజని నిలదీశారు.

# హంగేరిలో కొత్త గాలి



పశ్చిమాసియా మొదలుకొని ప్రపంచం నలుమూలల నుంచీ దుర్వార్తలే వింటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇది మరో పిడుగుపాటు. పదహారేళ్లుగా హంగేరిని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న కన్సర్వేటివ్ జాతీయవాది, ప్రధాని విక్టర్ ఒర్బాన్ ఘోరంగా ఓటమిపాలయ్యారు. 199 స్థానాలున్న పార్లమెంటుకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ ఫిడెస్‌కి కేవలం 55 స్థానాలు మాత్రమే రాగా, ఆయన్నుంచి విడిపోయి, మధ్యేవాద మితవాద పక్షం టీసా పార్టీని స్థాపించిన పీటర్ మాజార్‌కు అనూహ్యంగా 138 స్థానాలు లభించాయి. తీవ్ర మితవాద పక్షం అవర్ హోంల్యాండ్‌కు 6 దక్కాయి. తుది ఫలితాలు అధికారికంగా ప్రకటించాల్సివుంది. ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయిస్తున్న ఒర్బాన్ ఓటమిని ఎవరూ ఊహించలేదు. ఆయనపై ప్రజానీకంలో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని స్వతంత్ర సర్వే సంస్థలు చెప్పినా ఎవరూ నమ్మలేదు. టీసా పార్టీ దాదాపు 6 శాతం పాయింట్ల ఆధిక్యత తెచ్చుకుంటేనే కనీసం సాధారణ మెజారిటీ కూడా అసాధ్యమని కొన్ని మీడియా సంస్థలు చెప్పగా... అధికార పార్టీకన్నా టీసా పది పాయింట్లు వెనకబడివుందని ప్రభుత్వ అనుకూల మీడియా ఢంకా బజాయించింది. ఈ ఎన్నికల సందర్భంగా హంగేరి ఏమాత్రం పొంతనలేని రెండు భిన్న ప్రపంచాలు చూసింది. అధికారపక్షం వైపు మొగ్గే ప్రపంచం ఒర్బాన్ మరో నాలుగేళ్లు ఏలబోతున్నారంటూ మోత మోగించింది. అందులో మీడియా సంస్థలూ, సామాజిక మాధ్యమాలూ, 'సాధారణ పౌరులూ' ఉన్నారు. అటు పీటర్ మజార్‌ను సమర్థించే ప్రపంచం అందుకు భిన్నమైన విశ్లేషణలు చేసింది. ఈ రెండింటిలో ఏదో ఒకటి మాత్రమే 'నిజమైన ప్రపంచం' అయివుంటుందని అందరికీ తెలుసు. సోమవారం ఓట్ల లెక్కింపు తర్వాత 'నకిలీ ప్రపంచం' బట్టబయలైంది. ఒర్బాన్ హంగేరికి మాత్రమే పరిమితమైన సాధారణ నాయకుడు కాదు. ఆయన్ను అధికార పీఠం ఎక్కించిన ఫార్ములా దేశదేశాల నాయకులకూ శిరోధార్యంగా మారింది. సంప్రదాయవాదాన్నీ, జాతీయవాదాన్నీ నెత్తికెత్తుకుని ప్రజల భావోద్వేగాలను ఉచ్ఛస్థితికి తీసుకెళ్లటం ఎలాగో ఒర్బాన్ నేర్పారు. అమెరికాకు మాత్రమే కాదు... ప్రపంచానికంతకూ పెను సమస్యగా మారిన ట్రంప్ ఆయన స్ఫూర్తితోనే మాగా (మళ్లీ అమెరికాను మహోన్నతం చేద్దాం) ఉద్యమానికి అంకురార్పణ చేశారు. ఒర్బాన్‌కు ట్రంప్, పుతిన్ సన్నిహితులు. వారిద్దరి మాదిరే ఈయూతో వైరం. ఒర్బాన్ మార్కు ఏలుబడికి ఇంటా బయటా శత్రువులు అవసరం. వారు-- ఈయూ, కమ్యూనిస్టులు, వలసదారులు, శతకోటీశ్వరుడు, దాత జార్జి సోరోస్-- ఎవరైనా కావొచ్చు. అభద్రతా భావన కూ. విదేశీ బెడదకూ, సమాజంలోని నైతిక పతనానికీ, ఇతరత్రా ప్రమాదాలకూ సర్వరోగ నివారిణి తాను మాత్రమేనని ఒర్బాన్ పదహారేళ్లపాటు నమ్మించగలిగారు. 'సూపర్ మెజారిటీ' వచ్చినా పాలనపై పూర్తిస్థాయి పట్టు సంపాదించటం టీసా పార్టీకి అంత సులభం కాదు. ఎందుకంటే సకల అధికార వ్యవస్థలూ ఒర్బాన్ అనుకూలురతో నిండివున్నాయి. ఆర్థిక సంస్థలూ, అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘం, అవినీతి నిరోధక విభాగం వగైరాలన్నీ ఆయన మనుషుల చెప్పుచేతల్లో నడుస్తున్నాయి. ఈయూ నుంచి బయటికొస్తేనే సకల సమస్యలూ పరిష్కారమవుతాయని ఆయన చెప్పిన మాటలు విశ్వసించబట్టే ఆర్థికంగా అధోగతిలోవున్నా జనం నమ్మారు. ఒర్బాన్ అనుకూల వ్యాపార సంస్థలు మాత్రమే లాభార్జనతో కళకళలాడాయి. నిరుద్యోగం పదేళ్ల రికార్డును అధిగమించింది. నిరుడు ఆర్థిక వృద్ధి 0.4 శాతం. కొన్నేళ్లుగా కష్టాల్లోవున్న పోలెండ్ సైతం 3.6 వృద్ధి రేటు సాధించగా... బల్గేరియా, రుమేనియా సైతం మెరుగ్గా ఉన్నాయి. ఇక అవినీతిలో హంగేరిది అగ్రస్థానం. ఇరాన్ శాంతి చర్చలకన్నా ముందు, ఒర్బాన్ గెలుపుకోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హంగేరి వెళ్లి ప్రచారం చేశారు. కానీ ఇరాన్ శాంతి చర్చల మాదిరే, ఒర్బాన్ కూడా కుప్పకూలారు. ఆయన ఓటమితో ఈయూ దేశాలు పండగ చేసుకుంటున్నాయి. హంగేరి ప్రజలు తమతోనే ఉన్నారని సంబరపడుతున్నాయి. కానీ అధోగతిలోవున్న హంగేరికి అందరూ ఆపన్న హస్తం అందించటం అత్యవసరం.

# మళ్లీ యుద్ధ మేఘాలు!



చరిత్రాత్మకం అన్నారు. ఉన్నతస్థాయి చర్చలన్నారు. దౌత్యం పూర్తి స్థాయిలో పనిచేస్తోందన్నారు. శాంతికి పశ్చిమాసియా చేరువలో ఉందన్నారు. పాకిస్తాన్ రాజధాని ఇస్లామా బాద్‌లో 21 గంటలపాటు కొనసాగిన అమెరికా--ఇరాన్ ప్రతినిధి బృందాల చర్చలపై ఎప్పటికప్పుడు మీడియాలో వచ్చిన సమాచారం సారాంశమిది. తీరా బయటికొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చర్చలు విఫలమయ్యాయని ప్రకటించి నిష్క్రమించారు. ఆ వెంటనే ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు భాష మొదలైంది. అమెరికా ఏకపక్ష వైఖరివల్ల 47 సంవత్సరాల తర్వాత ఆ రెండు దేశాలమధ్యా నేరుగా సాగిన చర్చలు చివరికిలా నీరుగారాయి. వచ్చేవారం మరోసారి చర్చలుంటాయని చెబుతున్నారు. కానీ అమెరికా వైఖరి మారకపోతే ప్రయోజనం శూన్యం. ట్రంప్ వచ్చాక చర్చల అర్థమే మారిపోయింది. చర్చలంటే ఆయన శాసిస్తే ఎదుటిపక్షం శిరోధార్యంగా స్వీకరించటం తప్ప మరేంకాదు. అసలు ఈ యుద్ధంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వాన్స్ నాయకత్వాన ప్రతినిధి బృందాన్ని పంపటంలోనే ఆయన నిజాయితీలేమి వెల్లడైంది. ఏ అధికారమూ లేని, సొంతంగా ఎలాంటి చొరవా తీసుకోలేని ఆ అశక్త బృందం చివరకు ఉత్త డొల్లగా మిగిలిపోయింది. ట్రంప్ తీరు 90వ దశకం మొదట్లో సోవియెట్ యూనియన్ కుప్పకూలిననాటి పరి స్థితుల్ని తలపిస్తోంది. అంతవరకూ సోవియెట్ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సమావేశాలు జరగటం, దేశంనుంచి విడిపోతున్నట్టు ప్రకటించటం రివాజై పోయింది. నిజంగా అలా ప్రకటించేవారి బలాబలాలేమిటో, ఆ తీర్మానాలు అమలయ్యే అవకాశం ఉందో లేదో తెలియని స్థితి. ఇలాంటి అనిశ్చితే ఇప్పుడు అమె రికాను ఆవరించింది. నరమేథాన్ని సాగిస్తూ ఘనవిజయాలుగా ప్రకటించుకోవటం, ఇరాన్ నాగరికత ఈ రాత్రితో అంతం కాబోతున్నదని ప్రకటించటం, అంతలోనే చర్చలకు రావాలంటూ బెదిరించటం ట్రంప్ అలవాటు చేసుకున్నారు. ఇజ్రాయెల్‌తోపాటు ఈ యుద్ధానికి లోపాయికారీగా మద్దతిచ్చిన దేశాలన్నీ ఇరాన్‌నుంచి శరపరంపరగా వచ్చి పడుతున్న క్షిపణుల ధాటికి బెంబేలెత్తినా, అక్కడ పెనువిధ్వంసం చోటుచేసుకుంటున్నా ట్రంప్ బడాయి మాటలు ఆగలేదు. ఆయన ప్రకటనలకు భిన్నమైన స్థితిగతులున్నాయని సైనికాధికారులే మీడియాకు రహస్యంగా చెప్పటం అమెరికాలో కుప్పకూలుతున్న వ్యవస్థలకు ఆనవాలు. సోవియెట్ కనుమరుగయ్యే ముందు కూడా ఇలాంటి ధోరణులే కనబడ్డాయి. ఇతర దేశాల సహకారంతో హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ట్రంప్ చెప్పిన కొన్ని గంటలకే, అందుకు తాము అంగీకరించబోమని నాటో భాగస్వామ్య దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్‌లు ప్రకటించి గాలి తీశాయి. 'హోర్ముజ్ దిగ్బంధం' అంటూ చేసిన ప్రకటనకు అర్థం ఇరాన్ నౌకాశ్రయాల దిగ్బంధమని అమెరికా సైన్యం ఆ వెంటనే తెలిపింది. సోమవారం నుంచి అమల్లోకి వచ్చిందని కూడా ప్రకటించారు. కానీ గల్ఫ్ దేశాలే దీన్ని నిరసిస్తున్నాయి. ట్రంప్ చర్య ఈ ప్రాంతం మొత్తాన్ని శాశ్వతంగా యుద్ధ ఊబిలోకి దించేస్తుందని సౌదీ అరేబియాతోసహా చాలా దేశాలు ఆందోళనపడుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులు యుద్ధానికి ముందు మాదిరే రోజుకు 70 లక్షల బ్యారెళ్లకు చేరు కున్నాయి. అవి ఎర్ర సముద్రం గుండా వెళ్తున్నాయి. కానీ అమెరికా దుందుడుకు చర్యకు దిగితే యెమెన్‌లోని హౌతీలు ఆ ఎగుమతుల్ని దెబ్బతీస్తారు. తన నాయకత్వాన ఇన్ని దశాబ్దాలుగా సాగిన ఏకధ్రువ ప్రపంచం కళ్లముందు కుప్పకూలుతున్న వైనాన్ని అమెరికా గ్రహించకపోతే పోయిందిగానీ... చైనా నాయకత్వంలో కొత్త అమరిక మొగ్గతొడుగుతోందన్న సంగతైనా అది తెలుసుకోవాలి. ఈ యుద్ధం తనకూ, ఇరాన్‌కూ మధ్య పంచాయతీ కాదు. అది పశ్చిమాసియాకు పరిమిత మైంది అంతకన్నా కాదు. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని క్రమేపీ బలహీనపరుస్తున్న ఒక నిరర్థక యుద్ధం. అది చైనా నాయకత్వాన కొత్త కూటమికి పురుడు పోస్తున్న ప్రమాదకర యుద్ధం. ఆర్థికంగా, సైనికంగా ప్రపంచంలోనే తాము సర్వశక్తిమంతులమని ఇరాన్‌తో చర్చలకు చాన్నాళ్లముందు జేడీ వాన్స్ అన్నారు. ట్రంప్ ప్రభావం ఆయనపై ఎక్కువే ఉన్నట్టుంది. ఆ దృశ్యం మారుతున్న సంగతిని అమెరికా నాయకత్వం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

# బిహార్‌కు బీజేపీ సారథ్యం!



మండల్ రాజకీయాలకు పుట్టిల్లుగా మారి, రెండున్నర దశాబ్దాలుగా జాతీయ రాజకీయ పక్షాలకు నిలువనీడ లేకుండా పోయిన బిహార్‌లో బుధవారం తొలిసారి బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. ఆ పార్టీ నాయకుడు సమ్రాట్ చౌధరి నేతృత్వంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడం కొన్నేళ్ల క్రితం ఊహించని పరిణామం. అయితే కింగ్‌మేకర్‌గా లేదా జూనియర్ భాగస్వామిగా జేడీ(యూ) అధినేత నితీశ్‌కుమార్ నాయకత్వంలోని ప్రభుత్వాల్లో కొనసాగుతూ వచ్చిన బీజేపీ... ఎంతో సహనంతో, ఓపికతో సుదీర్ఘకాలం ఈ రోజు కోసం వేచిచూసింది. ఆఖరికి 2020లోనూ, నిరుడు జరి గిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రధాన భాగస్వామ్య పక్షం జేడీ(యూ)కు మించి స్థానాలొ చ్చినా సీఎం పదవి కోసం పట్టుబట్టకుండా ఉండిపోయింది. దఎలా ఒప్పించిందో, ఏం చేసిందో... ఆర్నెల్లు కాకుండానే ఆయన్ను రాజ్యసభకు పంపి, ఆ పదవి కైవసం చేసుకుంది. అసలు నిరుడు నవంబర్‌లో జరిగిన బిహార్ ఎన్నికల సందర్భంలోనే ఈసారి నితీశ్‌ను సీఎం పదవినుంచి తప్పించి, బీజేపీయే పగ్గాలు చేపడుతుందన్న ప్రచారం జరిగింది. కానీ అది విజయావకాశాలను దెబ్బతీయొచ్చన్న ఉద్దేశంతో రెండు పార్టీలూ కొట్టిపారేశాయి. బహుశా తనను తప్పిస్తారని నితీశ్ కూడా ఊహించివుండరు. ఎందుకంటే కుమారుడికి రాజ్యసభ సీటు ఇవ్వాలంటూ ఆయన ఫిబ్రవరిలో బీజేపీ అగ్రనేతలను కలిసి పట్టుబట్టారు. చివరికి తానే ఆ సీటు తీసుకుని, సీఎం పదవి బీజేపీకి అప్పగించాలని నితీశ్ నిర్ణయించటంతో కుమారుడితోపాటు పార్టీ అగ్ర నేతలంతా ఒక్కసారిగా దిగ్భ్రాంతిలో మునిగారు. పదకొండేళ్లనాడు అప్పటి పార్టీ నేత జితన్‌రాం మాంఝీని తొమ్మిది నెలలపాటు సీఎం పదవిలో కూర్చోబెట్టడం మినహా దాదాపు 21 ఏళ్లపాటు బిహార్ ఏలికగా నితీశ్ కొనసాగారు. మధ్యలో కూటములు మార్చినా, జనం మాత్రం ఆయన వెనకే దృఢంగా నిలబడ్డారు. మునుపటితో పోలిస్తే పార్టీ అధినేతగా నితీశ్ అంత ఆత్మవిశ్వాసంతో లేరని స్థానిక మీడియా చెబుతూవచ్చింది. ఇది వయసు పైబడటంవల్లనా, పార్టీలోని అంతఃకలహాలా అన్న విషయంలో ఎవరి విశ్లేషణలు వారివి. మండల్ రాజకీయాలు బలంగా వేళ్లూను కున్న రాష్ట్రాన్ని జాతీయపక్షం చేతుల్లో పెట్టడంపైనా నితీశ్‌పై విమర్శలొచ్చాయి. కానీ బీజేపీ ఆ రాజకీయాలకు భంగం వాటిల్లకుండా చాలా చాకచక్యంగా వ్యవహరించింది. ఉత్తరప్రదేశ్ తరహాలో బిహార్‌లో కూడా ఆదినుంచీ సంఘ్ పరివార్‌ను నమ్ముకున్నవారికే పగ్గాలు అప్పగించాలని ఒత్తిళ్లు వచ్చినా అధిష్ఠానం వాటిని అంగీకరించలేదు. మొదటి నుంచీ పార్టీలో కొనసాగినవారిని కాదని, ఎనిమిదేళ్లనాడు వచ్చిన సమ్రాట్‌వైపే మొగ్గు చూపటానికి కారణం ఆయన బాగా వెనకబడిన కుష్వాహా సామాజిక వర్గానికి చెందిన వారు కావటమే. బిహార్ ప్రత్యేక పరిస్థితులరీత్యా ఇది తప్పదని అధిష్ఠానం భావించింది. లాలూ సతీమణి రబ్డీదేవి ప్రభుత్వంలో ఉంటూ 26 యేళ్ల క్రితం బీజేపీ కారణంగానే మంత్రి పదవి పోగొట్టుకున్న సమ్రాట్... 2018లో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్లమెంటరీ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు... కేవలం శాశ్వత ప్రయోజనాలే ఉంటాయంటారు. కానీ ప్రయోజనాలు మాత్రమే చూసుకున్నా ఎదగటం కష్టమే. తనేంటో నిరూపించుకోవాలి. పార్టీ నాయకత్వానికి నమ్మకం కలిగించాలి. ఆ పని సమ్రాట్ సమర్థవంతంగా చేయబట్టే ఇవాళ సీఎం పదవి అందుకో గలిగారు. యాదవేతర కులాల్లో పట్టు సంపాదించుకోవాలన్న బీజేపీ వ్యూహానికి ఆయన సమర్థత, కులం తోడ్పడ్డాయి. అయితే బిహార్‌కు సమస్యలు తక్కువేం లేవు. ఇప్పటికీ అది దేశంలోని నిరుపేద రాష్ట్రాల్లో ఒకటి. బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగిపోయిందంటూ ఎంత గొప్పలుపోయినా బిహార్‌లో రోడ్లు, ఆరోగ్యరంగం, విద్యారంగం సక్రమంగా లేవు. లాలూ హయాంతో పోలిస్తే మెరుగ్గానే ఉండొచ్చుగానీ... శాంతిభద్రతలు ఇంకా పూర్తిస్థాయిలో చక్కబడలేదంటారు. మౌలిక సదుపాయాల మెరుగుదల, పారదర్శకత, జవాబుదారీతనం తన ప్రాముఖ్యతలని ప్రమాణస్వీకారం చేశాక ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో సమ్రాట్ ప్రకటించటం గమనిస్తే ఎక్కడెక్కడ మరమ్మతు అవసరమో ఆయన సక్రమంగానే గుర్తించారని అర్థమవుతుంది. మొత్తానికి బీజేపీ నేతృత్వంలో బిహార్ పయనం ఎలా ఉంటుందో ముందు తెలుస్తుంది.

## అక్రమ తవ్వకాల నియంత్రణలో మధ్యప్రదేశ్ వైఫల్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ : రక్షిత జాతీయ అభయారణ్యం చంబల్ లో అక్రమంగా జరుగుతున్న ఇసుకతవ్వకాలను అడ్డుకోవడంలో విఫలమైన మధ్యప్రదేశ్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులపై విచారణ చేపట్టడంలో విఫలం కావడంతో, పారామిలటరీ బలగాలను మోహరించనున్నట్లు కోర్టుకు వెల్లడించడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ఘోర వైఫల్యం కారణంగానే పర్యావరణ పరంగా సున్నితమైన ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని మండిపడింది. చంబల్ ఘరియల్ అభయారణ్యం ఈ మూడు రాష్ట్రాల పరిధిలోకి వస్తుంది. ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించిన సంగతి తెలిసిందే. ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలపై తరుచుగా వినియోగించే మార్గాల వెంబడి వాహనాలక కదలికలను పర్యవేక్షించేందుకు జిపిఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అలాగే పైలెట్ ప్రాజెక్టుగా అభయారణ్యంలోని కీలక ప్రాంతాల్లో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ ఫుటేజీలను నేరుగా జిల్లా మెజిస్ట్రేట్, పోలీస్ స్టేషన్లకు వెళ్లేలా చూడాలని తెలిపింది. ఏవిధమైన ఉల్లంఘన జరిగినా ఇసుక తరలింపు వాహనాలను జప్తు చేస్తామని, తిరిగి సుప్రీంకోర్టు అనుమతితోనే వాటిని విడుదల చేయడం సాధ్యమవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసు తదుపరి విచారణను మే 11కి వాయిదా వేసింది. ఏప్రిల్ 13న, జరిగిన పరిణామాల తీరు, గనుల తవ్వకం దారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, నేరపూరిత కార్యకలాపాల్లో మధ్యప్రదేశ్ ప్రభుత్వ వైఫల్యాన్ని, సహకారాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.

## సమాఖ్య వ్యవస్థపై అతిపెద్ద దాడి : కనిమొళి



న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ ముసుగులో ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులు సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న అతిపెద్ద దాడిగా డిఎంకె ఎంపి కనిమొళి విమర్శించారు. ఈ బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలు శుక్రవారం నల్లరంగు దుస్తులును ధరించి లోక్ సభకు హాజరయ్యారు. పార్లమెంటులో మహిళా రిజర్వేజన్ బిల్లుపై చర్చ సందర్భంగా కనిమొళి మాట్లాడారు. నారీ శక్తి వందన అధినియమ్, 2023ని గురువారం రాత్రి గెజిట్ లో నోటిఫై చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శించారు. తాను కేవలం డిఎంకె ప్రతినిధిగానే కాకుండా, ఎన్నికల్లో తమ ఓట్లకు విలువ ఉండదని, పార్లమెంటులో తమ గొంతు నొక్కబడుతుందని వెల్లడించిన ఎనిమిది కోట్ల మంది ప్రజల ప్రతినిధిగా నిలబడతానని అన్నారు. కేంద్రం చర్య దిగ్భ్రాంతికరమని, పార్లమెంటులో ఈ బిల్లుపై చర్చ చేపడుతుండగా, నిన్న దీనిపై నోటిఫై చేయాల్సిన అవసరం ఏమిటని అన్నారు. ఈ సభ పట్ల కేంద్రానికి గౌరవం లేదా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ ముసుగులో ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులు సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న అతిపెద్ద దాడి అని మండిపడ్డారు. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 1.6కి తగ్గిందని, తమ రాష్ట్రం జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలకు ఇచ్చిన వాగ్దానమని అన్నారు. బిజెపి దాడిని ఎదిరించి, అభివృద్ధిలో ఈ ఐదు రాష్ట్రాలు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. జనాభాను నియంత్రించాలన్న కేంద్ర ప్రభుత్వ పిలుపుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. సంతానోత్పత్తి రేటు తగ్గిందని అన్నారు. 2001లో దక్షిణాది రాష్ట్రాల ప్రజల గొంతు విన్న ప్రభుత్వం అధికారంలో ఉందని, అన్యాయాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందని అప్పటి పార్లమెంటు గ్రహించినందువలన మరో 24 ఏళ్ల గడువు ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు సీట్లను 850కి ఎందుకు పెంచాలని ప్రశ్నించారు. జనాభా స్వరూపం మారిందని, పునర్విభజనకు 15 ఏళ్ల నాటి 2011 జనాభా లెక్కల డేటాను ఎందుకు వినియోగిస్తున్నారు. మాటలకు, చేతలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

## తల్లి, చెల్లిని గుర్తుచేసుకుని ఓటేయండి : మోడీ



న్యూఢిల్లీ : మహిళా రిజర్వేషన్ చట్ట సవరణలపై కీలకమైన ఓటింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రధాని మోడీ శుక్రవారం లోక్‌సభ ఎంపీలందరికీ ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దయచేసి మీ కుటుంబాల్లోని మహిళలను గుర్తుచేసుకుంటూ.. మీ మనస్సాక్షిగా ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయండి. శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించే ఈ చట్టం, మన దేశంలోని మహిళలకు న్యాయం చేయడానికి లభించిన ఒక గొప్ప అవకాశం. దయచేసి మన నారీశక్తికి కొత్త అవకాశాలను దూరం చేయవద్దు. ఈ సవరణ ఏకగ్రీవంగా ఆమోదం పొందితే, అది మన దేశ మహిళలకు మరింత సాధికారతను కల్పించి, మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. చరిత్ర సృష్టించడానికి ఈ రోజు మనమందరం ఏకమవుదాం. దేశ జనాభాలో సగంగా ఉన్న భారతదేశ మహిళలు తమకు దక్కాల్సిన న్యాయమైన హక్కులను పొందేలా చూద్దాం. ఇంట్లో ఉన్న మీ తల్లి, సోదరి, కుమార్తె, లేదా భార్యను దృష్టిలో ఉంచుకుని మీ మనస్సాక్షి చెప్పిన మాట విని మహిళా కోటా బిల్లుకు ఓటు వేయండి అని మోడీ ఎక్స్ పోస్టులు లోక్‌సభ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.

## సొంత పార్టీ నేతలపై రాఘవ్ చద్దా సెటైర్లు





ఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై చర్చ కొనసాగుతోంది.అయితే, ఈ కీలక బిల్లులుపై చర్చ జరిగే సమయంలో సొంత పార్టీ నేతల గైర్హాజరుపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా సెటైర్లు వేశారు. రాజ్యసభ ఉపనాయకుడి పదవి నుంచి నన్ను తొలగించారు. అయినా సరే మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌పై చర్చ జరుగుతుంటే సభకు నేను హాజరయ్యాను. మరి వాళ్లద్దరేరి అంటూ ఆప్ పార్టీ ప్రతినిధి, పార్టీ నూతన రాజ్య సభ ఉపనాయకుడిని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. నా పార్టీకి చెందిన నాయకుడు, నా స్థానంలో కొత్త నియమితులైన ఉప నాయకుడు కూడా సభలో లేరు. ఆప్ ఇటీవల తొలగించబడిన ఉప నాయకుడిని నేను. నేను సభలోనే ఉన్నాను. నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు' అని అన్నారు. రాజ్యసభలో ఆప్ ఉప నాయకుడి పదవి నుంచి చద్దాను ఇటీవల తొలగించడంతో పాటు, సభలో ఆయన మాట్లాడే సమయాన్ని కూడా పార్టీ తగ్గించిందని ఆరోపణలు వచ్చాయి. ఈ నిర్ణయంపై పార్టీలో విభేదాలు ఉన్నాయన్న ఊహాగానాలకు ఈ పరిణామం ఆజ్యం పోసింది.

# రుతుపవనాల దగా?



ఒక్కోసారి కష్టాలు కూడబలుక్కుని వస్తాయంటారు. అసలే అమెరికా, ఇజ్రాయెల్ దురాక్రమణ యుద్ధాలతో ఏటికి ఎదురీదుతున్న ప్రపంచంపై ఈసారి ప్రకృతి కూడా పగబట్టినట్టు కనబడుతోంది. రాగల కాలంలో వాతావరణ పరిస్థితుల గురించి భారత వాతావరణ విభాగం(ఐఎండీ), ప్రపంచ వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించిన అంచనాలు భయపెడుతున్నాయి. భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్ర జలాల్లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల ఉష్ణోగ్రతలు భారీగా పెరగటంతోపాటు అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయని ప్రపంచ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించగా, మన దేశంలో రుతుపవనాలు బలహీనపడి సాధారణంకన్నా తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ ప్రకటించింది. ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ సైతం ఇదేవిధంగా చెబుతోంది. వైద్య పరిభాష మాదిరే వాతావరణానికి సంబంధించిన పరిభాష కూడా సామాన్యులకు కొరుకుడు పడదు. 'సాధారణంకన్నా తక్కువ' వర్షపాతం ఉంటుందంటే-- తీవ్ర కరవు పరిస్థితులు ఏర్పడతాయని. మన దేశంలో 60 శాతంమంది రైతులు ఖరీఫ్ సీజన్‌లో పూర్తిగా రుతుపవనాల వర్షాలపైనే ఆధారపడతారు. శాస్త్రవేత్తల అంచనా నిజమైతే ఇప్పటికే అనేకచోట్ల వడగళ్లుపడి, వర్షాలు కురిసి నష్టపోయిన రైతులకు ఇది సహజంగానే గోరుచుట్టుపై రోకటి పోటువంటి దవుతుంది. ఒకప్పుడు 'వాన రాకడ... ప్రాణం పోకడ' ఎవరికీ తెలియదనేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కనీసం మూడురోజులముందే వాన ఎక్కడెక్కడ పడే అవకాశం ఉన్నదో, దాని తీవ్రత ఎలావుంటుందో అంచనా వేస్తున్నారు. తుపాన్లు, ఉప్పెనలు, సునామీలు వంటివి ముందస్తుగా పసిగట్టి వాటివల్ల కలిగే నష్టాన్ని కనిష్ఠ స్థాయికి ఉంచగలుగుతున్నారు. అలాగని అన్నీ కచ్చితంగా చెప్పటం ఇంకా సాధ్యపడటం లేదు. ప్రకృతిని అంచనా వేయటం జూదంలాంటిది. అది అర్థమైనట్టే కనబడుతుంది. తీరా కొన్ని సందర్భాల్లో అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుంది. అలాగని ఏమరుపాటుతో ఉంటే ముంచేస్తుంది. అందుకే సమస్యలొస్తాయన్న అంచనాలతో ముందస్తు చర్యలు ఎప్పుడూ తప్పనిసరవుతాయి. అయితే ప్రస్తుత అంచనాలు ప్రాథమికమైనవి. వచ్చే నెలాఖరు నాటికి మరికొంత స్పష్టత వస్తుంది. ఎల్ నినో ఏర్పడటానికీ, రుతుపవనాలు బలహీనపడటానికీ మధ్య బలమైన సంబంధం ఉంది. గత 70 ఏళ్లలో 17 సార్లు ఎల్ నినో ఏర్పడితే అయిదుసార్లు సాధారణం లేదా అంతకన్నా ఎక్కువ వర్షాలు కురిశాయి. మిగిలిన సంవత్సరాల్లో తక్కువ వర్షపాతమే నమోదైంది. గ్రామీణ భారతంలో మెజారిటీ ప్రజానీకం వ్యవసా యంపై ఆధారపడతారు. అందువల్లే వర్షాలుపడక కరువుకాటకాలు ఏర్పడితే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌వంటి ఒకటి రెండు రాష్ట్రాల్లో వానలు లేకపోవడం లేదా అకాల వర్షాలు పడటం కారణంగా పంటలు దెబ్బతిన్నాయిగానీ... దేశవ్యాప్తంగా గత రెండేళ్లుగా వర్షపాతం బాగానే ఉంది. సాగు దిగుబడి పెరిగింది. ఆహార ధరలు అదుపులో ఉన్నాయి. అందువల్లే రిజర్వ్‌బ్యాంకు వడ్డీరేట్లు తగ్గించింది. కానీ ఇదంతా తారుమారైతే ఆహార ద్రవ్యోల్బణం పెరిగి, వడ్డీరేట్లు మళ్లీ పైపైకి పోతాయి. నిజానికి ఇరాన్ యుద్ధంవల్ల ఇప్పటికే ఆ పరిస్థితి ఉంది. మన దేశానికి సంబంధించి కేవలం ఎల్ నినో ఒక్కటే నిర్ణాయక శక్తి కాదు. హిందూమహాసముద్రంలో పశ్చిమ(ఆఫ్రికా వైపు), తూర్పు(ఇండొనేసియా వైపు) ప్రాంతాలమధ్య ఉండే ఉష్ణోగ్రతల వ్యత్యాసం వల్ల అనుకూల, ప్రతికూల, తటస్థ ద్విధ్రువ (డైపోల్) స్థితులు ఏర్పడవచ్చు. అనుకూల స్థితి ఎల్ నినోవల్ల ముందుకు కదల్లేని రుతుపవనాలకు బలం చేకూర్చి భారత్ వైపు వచ్చేలా చేస్తుంది. మిగిలిన రెండూ అందుకు భిన్నమైన ఫలితాలనిస్తాయి. దానికితోడు యురేసియా ప్రాంతంలో ఈసారి మంచుకవచం తక్కువుందంటున్నారు. దాన్ని పరిగణనలోకి తీసుకుంటే రుతుపవనాలు మెరుగ్గానే ఉంటాయనుకోవచ్చు. ఏదేమైనా ఈసారి రుతుపవనాలపై ఏ ప్రభావాలు బలంగా పనిచేస్తాయో, వాటి ఫలితాలెలా ఉంటాయో పెద్ద సస్పెన్స్. అంతా సవ్యంగా ఉండాలని కోరుకోవటం మినహా ఎవరైనా చేయగలిగిందేమీ లేదు.

# డీ-లిమిటేషన్.. హైబ్రిడ్ పరిష్కారం!




దేశ రాజకీయ దిశను, రాష్ట్రాల మధ్య అధికార సమతుల్యతను శాసించే పెనుమార్పు కానున్నది. జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలనే రాజ్యాంగ సూత్రానికి, అభివృద్ధి చెందిన రాష్ట్రాల రాజకీయ ఉనికికి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో 'మధ్యేమార్గం' వెతకాల్సిన బాధ్యత నేటి నాయకత్వంపై ఉంది. కేంద్రం లెక్కల ప్రకారం ఇప్పుడున్న పార్లమెంట్ సీట్లు 543ను 50 శాతం పెంచుతూ 850కి తేబోతున్నది. అందులో కేంద్రపాలిత ప్రాంతాలకు 35 సీట్లు కేటాయించింది. ఇక రాష్ట్రాలకు 815 సీట్లు దక్కనున్నాయి. అయితే, ఏ ప్రాతిపదికన ఈ సీట్లను పెంచుతున్నారనే విషయం స్పష్టంగా చెప్పడం లేదు. ఒక పక్క ఎంపీ సీట్లను 1971లో జరిగిన జనాభా లెక్కన ప్రకారం డీలిమిటేషన్ చేశారు. ఆ తర్వాత ఎలాంటి మార్పులు చేయలేదు. 2011లో జనాభా లెక్కలు జరిగినా.. ఆ తర్వాత జనాభా ఎన్యూమరేషన్ జరగనేలేదు. 2026లో జనాభా లెక్కించే ప్రక్రియ మొదలుకానున్న సమయంలోనే ఈ డీలిమిటేషన్ తీసుకురావడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అందులోనే మహిళా బిల్లును తెస్తా మనడం వల్ల గందరగోళంగా మారింది. కేంద్రం నియోజక వర్గాల సంఖ్య పెంచాలన్న ఉద్దేశం సరైనదే.. కానీ, అవలంబిస్తున్న విధానంపైనే దక్షిణాది రాష్ట్రాల్లో వ్యతిరేకత వస్తున్నది.

### డీలిమిటేషన్ అవసరమే.. కానీ,

1950లో ఒక ఎంపీ దాదాపు 5 లక్షల నుంచి 7.5 లక్షల మందికి ప్రాతినిధ్యం వహించేవారు. ఇప్పుడు అది ఏకంగా కొన్ని నియోజకవర్గాల్లో 30 లక్షలకు మించి పోయింది. దీనివల్ల ఓటరు ప్రయోజనాలకు గండిపడుతున్నది. ఒకవేళ జనాభా ప్రాతిపదికను మాత్రమే కొలమానంగా తీసుకుంటే అభివృద్ధి చెందుతున్న లేదా జీడీపీ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల ప్రయోజనాలకు ఇప్పుడు కాకున్నా.. భవిష్యత్తులో నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. అందుకే దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక సీఎంలు ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విఘాతమని ప్రకటించారు. కానీ, విధానంలో మార్పులను సూచించలేదు. ఏపీ సీఎం చంద్రబాబు దక్షిణాదిలో వృద్ధుల జనాభా పెరుగుతున్నదని.. డివిడెండ్‌లా కేంద్రం గ్రాంట్ ఇవ్వాలని మాత్రం సూచించా రు. అయితే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం హైబ్రిడ్ విధానాన్ని ప్రో-రేటా పద్ధతిలో విభజన చేయవచ్చని విశ్లేషించారు.. కేంద్రం డీలిమిటేషన్ ప్రకారం ఉదాహరణకు 100సీట్లు పెంచాలని అనుకుంటే అందులో 50 శాతం 50 సీట్లు జనాభా ఆధారంగా పెంచాలి. మిగతా 50సీట్లు ఆదాయం వస్తున్న రాష్ట్రాలకు మాత్రమే పెంచాలి. దీనివల్ల ఆదాయం వస్తున్న రాష్ట్రాలకు చట్టసభల్లో తగిన గౌరవం కల్పించినట్టు అవుతుంది. లేదంటే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల మద్దతు ఉంటే చాలు.. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు అనే పరిస్థితి వస్తే, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో అరణ్య రోదనగానే మిగిలే ప్రమాదం ఉన్నది.

### ఫెడరల్ స్ఫూర్తికి 'విప్' విఘాతం

కేంద్రం చేస్తున్న వాదన ప్రకారం.. ఉత్తరాది అయినా, దక్షిణాది అయినా ఆయా రాష్ట్రాల్లో ఉన్న సంఖ్యలో 50 శాతం పెరుగుతుంది.. దానివల్ల నష్టమేంటన్న ప్రశ్నలు వస్తున్నాయి. కానీ, చట్టసభల్లో ప్రాతినిధ్యం ఒక్కటే కాదు.. నియోజకవర్గాల నిధులు సహా ఎన్నో విషయాల్లో భారీ మార్పులు జరుగుతాయి. అందులో దక్షిణాదికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నది. ముఖ్యంగా ఏదైనా బిల్లు విషయంలో అధికార పార్టీ చెప్పిందే ఎంపీలు చేయాల్సి వస్తుంది. సభ్యులు ఎక్కువ ఉన్న ఉత్తరాదికే ఏ పార్టీ అయినా ప్రాధాన్యం ఇవ్వక తప్పదు.. అది అధికారంలో ఉన్నదైనా, ప్రతిపక్షంలో ఉన్నదైనా 'ఓట్ పోలరైజేషన్' రాజకీయాలకే మక్కువ చూపిస్తారు. దానివల్ల అనివార్యంగా దక్షిణాది ప్రయోజనాలకు తూట్లు పడక తప్పదు. రాష్ట్ర ప్రయోజనాలకు మరో ముఖ్యమైన అడ్డంకి 'విప్'.. మనదేశంలో దక్షిణాది ప్రజల సంశయాలు పోగొట్టాలంటే ప్రతి బిల్లుకు విప్ జారీ చేసే సంస్కృతిని కేంద్ర ప్రభుత్వమే పక్కనబెట్టాలి. ముఖ్యమైన బిల్లులకు మాత్రమే విప్ జారీ చేయాలి. ఫలితంగా ప్రాంతీయ అసమానతలకు కారణమయ్యే బిల్లుల విషయంలో ఎంపీలు స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారు. వాళ్లు దొంగ ఓటు వేయాల్సిన అవసరం లేదు.. ప్రాంతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటున్నామని బహిరంగంగా ఓటు వేయాలి. దీనివల్ల దక్షిణాది ప్రయోజనాలకు భవిష్యత్తులోనూ నష్టం జరగకుండా ఉంటుంది.

### 'హైబ్రిడ్' ఫార్ములా.. 50:25:25

ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా శాస్త్రీయమైన వెయిటేజీ విధానం అమలు చేయాలి.. అంటే జనాభా ప్రాతిపదికన పెంచే సీట్లను 50 శాతానికి పరిమితం చేయాలి. దేశాభి వృద్ధికి నిధులు సమకూరుస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహించడానికి 25 శాతం సీట్లు కేటాయించాలి. సామాజిక అభివృద్ధిని కూడా దృష్టిలో పెట్టుకుని విద్య, ఆరోగ్యం, జనాభా నియంత్రణలో రాణించిన రాష్ట్రాలకు గుర్తింపుగా మిగిలిన 25 శాతం సీట్లు కేటాయించాలి. ఈ పద్ధతి వల్ల ఉత్తర-దక్షిణ రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీలో సమతుల్యత ఏర్పడుతుంది. అంతే కాకుండా మిగితా రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను స్ఫూర్తిగా తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. డీ-లిమిటేషన్ అనేది ఉత్తర-దక్షిణ విద్వేషాలకు దారితీయకుండా, అందరినీ కలుపుకుపోయే 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో జరగాలి. అంకెలు పెరగడం ముఖ్యం కాదు, ఆ అంకెల వెనుక ఉన్న ప్రజల ఆశయాలకు న్యాయం జరగడం అన్నింటికంటే ముఖ్యమని నాయకులు గుర్తించాలి. రాజకీయ ప్రయోజనాల కంటే దేశ సమగ్రతే మిన్న అని భావించినప్పుడే ఈ క్లిష్టమైన సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

# ఎంపీ సీట్ల మధ్య అసమతుల్యత.. దేశ ఐక్యతకు భంగం!


కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అనుసరిస్తున్న పలు విధానాల వలన దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య దూరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాథం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది.

### తాజా డీలిమిటేషన్ మూలం..

రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు.. 1952లో 489 లోకసభ స్థానాలను ప్రకటించారు. రెండోసారి 1963లో 489 నుండి 522కు పెంచుతూ విభజన జరిగింది. ఇక మూడవ పర్యాయం 1973లో 522 నుండి 545 పార్లమెంటు సభ్యుల స్థానాలుగా పెరిగాయి. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అధిక ప్రయోజనం పొందనున్నాయని, అలా పొందకుండా నిరోధించడానికి చట్ట సవరణ ద్వారా డీలిమి టేషన్ ప్రక్రియను నిలిపివేశారు.. తిరిగి 1986 ఆర్టికల్ 84 సవరణ ద్వారా నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజన ప్రక్రియను 2026 వరకు వాయిదా వేశారు. కాబట్టి ఈ సంవత్సరం జనాభాను అనుసరించి నియోజకవర్గాల డీలి మిటేషన్ జరగబోతున్నది.

### రాజుకోనున్న అసంతృప్తి..

ఈ నేపథ్యంలో దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య జనాభా ఉత్పత్తి వృద్ధి రేటులో గణనీయంగా హెచ్చు తగ్గులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఏ క్షణంలోనైనా అసంతృప్తి భగ్గున మండడానికి సిద్ధంగా వుంది. 2026లో వివిధ రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతుంది. ఈ వెలుగులో ప్రధాన కార్యకారణాలను పరిశీలించాల్సి ఉంది. అందులో ప్రధానమైనది రాష్ట్రాల మధ్య ఙీ=




(ఛశ్మీశ్రీ టవతీఅశ్రీఙఎ =ఛీవ) సంతాన ఉత్పత్తి వృద్ధి నిష్పత్తి క్రమాన్ని అవగతం చేసుకోవాలి.

### దక్షిణాది రాష్ట్రాలకు శాపం

అక్షరాస్యత ఉన్నత చదువులు, కుటుంబ సంక్షేమం అభివృద్ధి తద్వారా సమాజ వృద్ధి పెంపొందడం వలన దక్ష ణాదిలో జనాభా తగ్గిపోయినది. ప్రజలు వస్తు సేవలను వినియోగించుకోవడం ద్వారా అధిక వస్తు సేవల పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే కాలంలో అటు ఉత్తర భారత రాష్ట్రాలలో నిర క్షరాస్యత, వెనుకబాటు మూలంగా అధిక జనాభా ఉంది. జనాభా నిష్పత్తి ఆధారంగా జీఎస్టీ సంపద పంపిణీలో అధిక నిధులను దేశ ఉత్తర రాష్ట్రాలు పొందుతున్నవి. జనాభా తక్కువ ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల పంపిణీ జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల పంపిణీలోనూ, నియోజకవర్గాల పునర్విభజనలోనూ వివక్ష కొనసాగడం తద్వారా రానున్న కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమించనున్నది. దక్షిణాదికి చెందిన ఆయా రాష్ట్రాలలోని అధికార, విపక్ష పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాలను పక్కనపెట్టి ఏకం కావలసిన తరుణం ఆసన్నమైనది.

### దక్షిణాది పిల్లిమెడలో గంట..

ఉత్తర భారతంలో విస్తరించిన బీజేపీ, దక్షిణాదిలో ఎలాగైనే సరే.. జండా ఎగరవేయాలని తహతహలాడుతున్నది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్రాలలో "సర్" అమలు పరుస్తున్నది. దీని ద్వారా ఎన్నికల సంఘం దేశంలో ముందు ఎప్పుడూ లేనంత తీవ్ర విమర్శలను వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎదుర్కొంటున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల పిల్లి మెడలో గంట ఎవరు కడతారో..? ఎదిరి చూడవలసి ఉన్నది.

### దూరం పెరిగితే ఐక్యతకు ప్రమాదం!

ఇప్పటికే ఆయా రాష్ట్రాల లోకసభ స్థానాలు మొత్తం 850 వరకు పెరగనున్నాయని తెలుస్తున్నది. అంటే రాష్ట్రాలలో గణనీయంగా లోకసభ స్థానాలు పెరగనున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో కొద్దో గొప్పో పెరుగనున్నాయి.. ఈ పరిస్థితులను రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలలో తమ ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకోవడానికి, ఇప్పటినుండే కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఒకవైపు 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన లోకసభ సమా వేశాలలో ప్రవేశ పెట్టే బిల్లును లోకసభ సభ్యులకు చేర వేశారు. మరోవైపు 2026 జనాభా ఆధారంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని సదరు బిల్లులో చేర్చారు. రానున్న కాలంలో దేశంలో ఉత్తర దక్షిణాది రాష్ట్రాల మధ్య దూరం పెరగడమే కాకుండా, దేశ ఐక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది.

# పక్కా ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమే

## తల్లయ్యాక తన ప్రాధాన్యతలు మారాయన్న కరీనా కపూర్

## రోజుకు 8 గంటలు మాత్రమే పని చేస్తానని వెల్లడి

## పక్కా ప్లానింగ్ తో పిల్లల బాధ్యతను మేనేజ్ చేశానన్న కరీనా

## తన భర్త పిల్లలను చూసుకున్నారని వెల్లడి





బాలీవుడ్ టాప్ హీరోయిన్లు దీపికా పదుకొణె, కరీనా కపూర్ ఖాన్ తల్లయ్యాక కెరీర్‌ను, పిల్లల బాధ్యతలను ఎలా బ్యాలెన్స్ చేయాలనే విషయంపై భిన్నమైన అభిప్రాయాలను పంచుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. పని గంటల పరిమితిపై దీపికా చేసిన వ్యాఖ్యలు ఒకెత్తు అయితే, ప్లానింగ్ ఉంటే ఏదైనా సాధ్యమేనని కరీనా చెప్పడం మరో ఎత్తు. తల్లయ్యాక తన ప్రాధాన్యతలు మారాయని, రోజుకు 8 గంటలు మాత్రమే పని చేస్తానని దీపిక స్పష్టం చేశారు. కొత్తగా తల్లయిన వారికి చిత్ర పరిశ్రమ, కుటుంబం మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. అయితే, ఈ నిబంధన వల్ల భారీ ప్రాజెక్టులైన 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్, ప్రభాస్-సందీప్ వంగా 'స్పిరిట్' వంటి సినిమాల నుంచి ఆమె తప్పుకోవాల్సి వచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు సినిమా మేకింగ్‌లో ఇది ఎప్పుడూ సాధ్యం కాదని విమర్శిస్తున్నారు. మరోవైపు కరీనా స్పందిస్తూ... 'ద బకింగ్‌హామ్ మర్డర్స్' షూటింగ్ కోసం లండన్‌లో 35 రోజులు ఉండాల్సి వచ్చినప్పుడు, పక్కా ప్లానింగ్‌తో పిల్లల బాధ్యతను మేనేజ్ చేశానని చెప్పారు. తను పనిలో ఉన్నప్పుడు భర్త సైఫ్ అలీ ఖాన్ ఇంట్లో పిల్లలతో ఉండి చూసుకున్నారని, ఇద్దరూ ఒకేసారి పని కోసం బయటకు వెళ్లకూడదనే నిబంధన పెట్టుకున్నామని తెలిపారు. షూటింగ్ మధ్యలో విరామం తీసుకుని ఇండియా వచ్చి పిల్లలతో గడిపేలా చిత్ర యూనిట్ సహకరించిందని, అన్నీ ముందుగానే ప్లాన్ చేసుకుంటే ఇబ్బంది ఉండదని ఆమె అభిప్రాయపడ్డారు. మొత్తానికి, దీపికా 'పని గంటల తగ్గింపు'ను కోరుతుంటే, కరీనా మాత్రం 'పరస్పర అవగాహన, ప్లానింగ్' తో ముందుకు వెళ్లవచ్చని సూచిస్తున్నారు.


# జోరు పెంచిన నయనతార.. మరో క్రేజీ హీరోతో ఛాన్స్!





ప్రతిభతో పాటు అదృష్టం కూడా ఉంటే ఇండస్ట్రీని దశాబ్దాల పాటు ఏలేయొచ్చు అని నిరూపిస్తున్న అతి కొద్ది మంది హీరోయిన్స్ లో నయనతార ప్రథమ స్థానంలో నిలుస్తుంది. సౌత్ లేడీ సూపర్ స్టార్ గా పేరు దక్కించుకున్న ఈమె తమిళ్, మలయాళం, తెలుగు , హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఒకవైపు హీరోయిన్ పాత్రలతో మరొకవైపు ఆధ్యాత్మిక పాత్రలతో మెరిసిన నయనతార.. అటు యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో కూడా అదరగొడుతున్న విషయం తెలిసిందే. ఒకవైపు హీరోయిన్గా మరొకవైపు నిర్మాతగా కూడా అడుగులు వేస్తున్న ఈమె.. ఇప్పుడు ఏకంగా టాలీవుడ్ మొదలుకొని బాలీవుడ్ వరకు సీనియర్ స్టార్ హీరోలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. విషయంలోకి వెళ్తే .. ప్రముఖ కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈమె.. సరోగసి ద్వారా ఇద్దరు మగ కవల పిల్లలకు జన్మనిచ్చింది. వివాహం తర్వాత ఈమె జోరు మరింత పెరిగిందనే చెప్పాలి. ఇందులో భాగంగానే .. 2023లో షారుక్ ఖాన్ తో కలిసి 'జవాన్' సినిమా చేసి ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. అటు బాలీవుడ్ లో కూడా తన మార్కెట్ ను పెంచుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ ఏడాది మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా చేసి ఇండస్ట్రీ హిట్ ను తన ఖాతాలో వేసుకుంది అంతేకాదు తాను పెట్టుకున్న కండిషన్స్ అన్నింటిని కూడా పక్కన పెట్టి మరీ ఈ సినిమాను ప్రమోట్ చేసి వార్తల్లో నిలిచింది నయనతార. అయితే అలాంటి ఈమె ఇప్పుడు మరో క్రేజీ హీరో సరసన నటించే అవకాశాన్ని అందుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఆయన ఎవరో కాదు బాలీవుడ్ స్టార్ హీరో, కండల వీరుడు సల్మాన్ ఖాన్. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఒక బడా ప్రాజెక్టులో నయనతార అవకాశం అందుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక దీనిపై త్వరలోనే అటు చిత్ర బృందం నుండి లేదా ఇటు నయనతార నుండి అధికారిక అనౌన్స్మెంట్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా వయసు పెరుగుతున్నా కూడా నయనతార క్రేజ్ ఏమాత్రం తగ్గట్లేదు.. లేడీ సూపర్ స్టార్ అనే ట్యాగ్ కి తగ్గట్లుగానే స్టార్ హీరోల సినిమాలలో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతోంది. ఇక ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిన నయనతార ప్రతిభతో పాటు అదృష్టాన్ని కూడా మూటగట్టుకొని ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో సమానంగా దూసుకుపోతూ ఉండడం విశేషం. ఇక నయనతార ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ఒకవైపు స్టార్ హీరోల సినిమాలలో హీరోయిన్ గానే కాకుండా.. మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది. అందులో భాగంగానే గతంలో వచ్చిన మూకుత్తి అమ్మన్ సినిమాకి సీక్వెల్ గా వస్తున్న మూకుత్తి అమ్మన్ 2లో నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రముఖ స్టార్ డైరెక్టర్ సుందర్ సి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో వరల్డ్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమాలో కూడా అవకాశం అందుకుంది . కన్నడ హీరో యష్ లీడ్రోల్ పోషిస్తున్న ఈ సినిమాలో ఆయనకు సోదరి పాత్రలో యాక్షన్ పర్ఫామెన్స్ తో అదరగొట్టడానికి సిద్ధమయ్యింది నయనతార. అలాగే బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్లో వస్తున్న ఎన్బికె 111 సినిమాలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. ఏదిఏమైనా అటు క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఇటు హీరోయిన్ మరొకవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో కూడా అలరిస్తోంది.

# రకుల్ ప్రీత్ సింగ్ వేగం అక్కడా తగ్గిందే!





-స్పైడర్- రిలీజ్ ముందు వరకూ రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ లో ఎంత బిజీగా ఉండేదో చెప్పాల్సిన పనిలేదు. వరుసగా స్టార్ హీరోల సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడిపేది. జయాపజయాలతో సంబంధం లేకుండా అమ్మడు తెలుగు అవకాశాలు అందుకుంది. కానీ -స్పైడర్- రిలీజ్ అనంతరం సీన్ మారింది. అప్పటి నుంచి అవకాశాలు తగ్గాయి. అలాగని పూర్తిగా అవకాశాలే లేకుండా పోలేదు. ఏదో సినిమాలో ఛాన్స్ అందుకుని టచ్ లో ఉండేది. కానీ బాలీవుడ్ లో రీలాంచ్ అయిన తర్వాత మాత్రం తెలుగు సినిమాల్ని లైట్ తీసుకుంది. ఆ సమయంలో వచ్చిన టాలీవుడ్ అవకాశాలు కూడా కాదంది. కానీ అనూహ్యంగా బాలీవుడ్ అవకాశాలతో బిజీ అయింది. ఎంతలా అంటే ఊపిరి సలపనంతగా సినిమాలు చేసింది. ఇదే సమయంలో వరుసగా కోలీవుడ్ లో కూడా అవకాశాలు ఊపందుకున్నాయి. దీంతో తమిళ, హిందీ భాషల్ని బ్యాలెన్స్ చేసి కెరీర్ ని ముందుకు తీసుకెళ్లింది. దాదాపు కెరీర్ మొత్తంలో ఇప్పటి వరకూ 18 హిందీ సినిమాలు చేసింది. -యారియాన్- బాలీవుడ్ అరంగేట్రం చేసింది. అటుపై -అయ్యారీ-, - దే దే ప్యార్ దే- లో నటించింది. ఈ సినిమా అమ్మడికి బాలీవుడ్ లో మంచి బ్రేక్ ఇచ్చింది. అనంతరం -మర్జావాన్-, -షిమ్లా మిర్చి-, -సర్దార్ కా గ్రాండ్‌సన్,- అటాక్: పార్ట్ 1-, -రన్‌వే 34-, -కట్‌పుట్లీ-, -డాక్టర్ జి,- -థాంక్ గాడ్-, -ఛత్రీవాలీ-, -ఐ లవ్ యు-, -హిందుస్థానీ 2-, - మేరే హస్బెండ్ కీ బీవీ- , -దే దే ప్యార్ దే 2- లో నటించింది. అయితే బాలీవుడ్ లో రకుల్ ప్రీత్ సింగ్ వేగం బాగా తగ్గింది. ప్రస్తుతం అమ్మడి ఖాతాలో ఒకే ఒక్క ప్రాజెక్ట్ ఉంది. -పతి పత్నీ ఔర్ వో 2- లో నటిస్తోంది. ఈ సినిమా మినహా కొత్త ప్రాజెక్టులు వేటికి అమ్మడు సైన్ చేసింది లేదు. ఈ సినిమా కూడా గత ఏడాది కమిట్ అయిన చిత్రం. కొత్త ఏడాదిలో ఎలాంటి కథలు విన్నట్లు బాలీవుడ్ లో ప్రచారం కూడా జరగలేదు. దీంతో ఉత్తరాదిన రకుల్ హవా తగ్గిందా? అన్న ప్రచారం ఊపందుకుంది. అటు భర్త జాకీ భగ్నానీ కూడా ఆర్థిక సంక్షోభంలో ఉన్న సంగతి తెలిసిందే. వరుస ఫ్లాప్ లతో పూజ ఎంటర్ టైన్ మెంట్స్ నష్టాల్లో కూరుకుపోయింది. దీంతో ఉన్న ఆస్తులు కూడా అమ్మాల్సి వచ్చింది. ఈ సమయంలో రకుల్ సినిమాలు కొంత కాలం పాటు ఫ్యామిలీకి అండగా నిలిచాయి. కానీ ఇప్పుడు ఆమెకు అవకాశాలు తగ్గడం మరింత ప్రతికూల పరిస్థితులకు దారి తీసే అవకాశం ఉంది.

# పెరగనున్న కిచెన్ బడ్జెట్..

## గ్యాస్ బండ మాత్రమే కాదు వంటనూనె ధరలు కూడా మండే అవకాశం..?





అమెరికా ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం అటు ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలపైన స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇప్పటికే ప్రపంచ మార్కెట్ల పైన దీని ప్రభావం స్పష్టంగా చూడవచ్చు. ప్రపంచంలోనే అత్యంత బిజీ ఓడరేవులైనటువంటి గల్ఫ్ దేశాలకు చెందిన పలు ఓడరేవులు మూతపడుతున్నాయి. ఇరాన్ చేస్తున్న దాడుల కారణంగా నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో భారత్ చైనా వంటి దేశాలు తీవ్రమైన ఇంధన కొరత ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం అటు ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలపైన స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇప్పటికే ప్రపంచ మార్కెట్ల పైన దీని ప్రభావం స్పష్టంగా చూడవచ్చు. ప్రపంచంలోనే అత్యంత బిజీ ఓడరేవులైనటువంటి గల్ఫ్ దేశాలకు చెందిన పలు ఓడరేవులు మూతపడుతున్నాయి. ఇరాన్ చేస్తున్న దాడుల కారణంగా నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో భారత్ చైనా వంటి దేశాలు తీవ్రమైన ఇంధన కొరత ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు అరేబియా సముద్రంలో అత్యంత కీలకమైనటువంటి సముద్ర మార్గాల్లో తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న నేపథ్యంలో నౌకలు నడవడం లేదు. . దీంతో తాజాగా ప్రపంచ సరఫరా వాణిజ్యం పైన దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగిపోయాయి. దీనికి తోడు ఇప్పుడు వంట నూనెల ధరలు కూడా సామాన్యులకు షాక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇరాన్ అమెరికా యుద్ధ ప్రభావంతో ప్రపంచ సరుకు రవాణా వ్యవస్థలు తీవ్ర అంతరాయానికి గురవుతున్నాయి. దీనివల్ల భారత్ దిగుమతి చేసుకునే అనేక వస్తువులు తీవ్ర అంతరాయానికి గురవుతున్నాయి. ఇందులో వంటనూనెను ప్రత్యేకంగా చెప్పవచ్చు. మనదేశంలో సన్ ఫ్లవర్ నూనె ఎక్కువగా మధ్య ఆసియా, ఉక్రెయిన్, తూర్పు యూరప్ దేశాల నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంది. ముఖ్యంగా అరేబియా సముద్రం ద్వారా మాత్రమే ఈ సరుకు రవాణా ఎక్కువగా జరుగుతుంది. తాజా యుద్ధ వాతావరణం నేపథ్యంలో నౌకలు తిరిగే మార్గాలు మూసివేశారు. ఫలితంగా వంటనూనెల ధరలు దేశీయ మార్కెట్లో భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వంట నూనెల్లో ఎక్కువగా వాడేది సన్ ఫ్లవర్ నూనె దీని ధర ప్రస్తుతం గడచిన వారంలో 20 రూపాయలు పెరిగింది. ప్రస్తుతం సన్ ఫ్లవర్ నూనె ధర 150 రూపాయల నుంచి 170 రూపాయలకు చేరుకుంది. అదే సమయంలో పామాయిల్ ధర కూడా ఒక లీటర్ పైన 20 రూపాయలు పెరిగింది. రాబోయే రోజుల్లో వంట నూనెల ధరలు మరింత పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వంట నూనెలు ఎక్కువగా విదేశాల నుంచి దిగుమతి అవుతున్న నేపథ్యంలో ఈ పరిస్థితి తలెత్తింది అని చెప్పవచ్చు. మన దేశం నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి అయ్యే వస్తువుల విషయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఎక్కువగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి అయ్యే ఆహార వస్తువులు భారతదేశానికి చెందిన ప్రముఖ నౌకాశ్రయాలలో నిలిచిపోయాయి, దీని ప్రత్యక్ష ప్రభావం అటు మాంసం పరిశ్రమ, వ్యవసాయ ఉత్పత్తులు, పౌల్ట్రీ పరిశ్రమ, అలాగే పలు ఇంజనీరింగ్ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, వస్త్ర పరిశ్రమ పైన నేరుగా ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. మన దేశానికి చెందిన ఫార్మా రంగానికి కూడా గల్ఫ్ దేశాలు అతిపెద్ద మార్కెట్ అని చెప్పవచ్చు. ఇరాన్ అమెరికా యుద్ధం కారణంగా దీని ప్రభావం స్పష్టంగా ఫార్మా రంగం పైన కూడా కనిపిస్తోంది.

# జక్కన్న 'వారణాసి'..

## ఫస్ట్ ఇండియన్ మూవీ అవుతుందా?



దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి, టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్ లో తెరకెక్కుతున్న వారణాసి మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ చరిత్రలో నెవ్వర్ బిఫోర్ అనేలా సినిమా రూపొందుతుందని తెలుస్తోంది. తాజాగా వారణాసి.. ఓ విషయంలో ఫస్ట్ ఇండియన్ మూవీగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. నిజానికి వారణాసిపై మంచి అంచనాలు నెలకొనగా.. థియేట్రికల్ రైట్స్ కు భారీ డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది సినిమా రిలీజ్ కానుండగా.. ఇప్పటి నుంచే పెద్ద ఎత్తున ఆఫర్స్ వస్తున్నాయని సమాచారం. ఓవర్సీస్ రైట్స్ కోసం ఒక ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ దాదాపు రూ.160 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. చాశ్రీంశీ అందులో నిజమెంతో తెలియదు కానీ.. నెట్టింట ప్రచారం మాత్రం జరుగుతోంది. ఒకవేళ ఆ డీల్ ఖరారైతే, ఓవర్సీస్ రైట్స్ రూపంలోనే అంత భారీ మొత్తాన్ని అందుకున్న తొలి భారతీయ సినిమాగా వారణాసి రికార్డు సృష్టించే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో ఇంకా ఓవర్సీస్ రైట్స్ ఆఫర్ పై వారణాసి మేకర్స్ డిసైడ్ అవ్వలేదని వార్తలు వస్తున్నాయి. నిజానికి ఒక సినిమాపై ఆసక్తి పెరగడానికి ట్రైలర్ లేదా టీజర్ కారణమవుతుంది. కానీ వారణాసి విషయంలో మాత్రం టైటిల్ గ్లింప్స్ విడుదలతోనే భారీ చర్చ మొదలైంది. దర్శకుడు రాజమౌళి తన ప్రత్యేక శైలిలో కథ రేంజ్ తో పాటు సినిమా ప్రపంచాన్ని పరిచయం చేస్తూ గ్లింప్స్ ను రూపొందించడంతో ప్రేక్షకుల్లో ఓ రేంజ్ లో అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ఓవర్సీస్ భారీ ఆఫర్ కు ఆ గ్లింప్సే కారణమని చెప్పాలి. ఇక సినిమా విషయానికొస్తే.. ఫాంటసీ మైథలాజికల్ జోనర్ లో తెరకెక్కుతున్న మూవీలో మహేష్ బాబు భిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. ముఖ్యంగా ఆయన రాముడి రూపంలో కనిపించే సన్నివేశాలు సినిమాలో కీలకంగా ఉంటాయని ప్రచారం జరుగుతోంది. ఇది మహేష్ కెరీర్ లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ అని చెప్పాలి. ఆయనతోపాటు బాలీవుడ్ స్టార్ హీరో ప్రియాంక చోప్రా కీలక పాత్ర పోషిస్తున్నారు. మందాకినిగా కనిపించనున్నారు. మాలీవుడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమార్ విలన్ కుంభ పాత్రలో నటిస్తున్నారు. ఆస్కార్ అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కథ, విజువల్స్, యాక్షన్ ఎపిసోడ్స్ అన్నీ ఇంటర్నేషనల్ లెవెల్ లో ఉండేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వారణాసి చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు టార్గెట్ పెట్టుకున్నారు. ముఖ్యంగా 120కి పైగా దేశాల్లో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .